# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 233 | హైదరాబాద్ | సోమవారం 09-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

తమిళనాడులో పొత్తుల రాజకీయం.. విజయ్ పార్టీకి ఎన్డీయే ఆహ్వానం

## రాష్ట్రపతి పర్యటనలో బెంగాల్ ప్రభుత్వం
# అన్ని హద్దులు దాటింది

- పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ ఉల్లంఘన
- హఠాత్తుగా అంతర్జాతీయ సంతాల్ సదస్సు వేదిక మార్పు
- మమతా బెనర్జీ ప్రభుత్వం తన పరిధి దాటి వ్యవహరించిందన్న కిషన్ రెడ్డి

11లో






11లో

## త్వరలోనే తెలంగాణలో
# ఉచిత స్కూటీలు..

- విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ
- 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులు
- నగరంలోని డీజిల్ బస్సులు జిల్లాలకు తరలింపు
- ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్ విధానం
- ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



11లో

## ఆకాశంలో సగం కాదు...
# నింగీ నేలా మీరే

- మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్
- ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పిస్తే చంద్రబాబు పొదుపు సంఘాలు తెచ్చారని వెల్లడి
- పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చాగంటి కోటేశ్వరరావు నియామకం
- ఆడపిల్లలా ఏడవొద్దు.. గాజులు తొడుక్కోలేదు వంటి మాటలు మాట్లాడటం తప్పే
- సినిమాల్లో మహిళలను కించపరిచేలా ఉంటే ఊరుకోనని హెచ్చరిక

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన
# నన్ను కలచివేసింది



11లో

## కొత్త హంగులతో తెలంగాణ శాసన మండలి
# భవనం ప్రారంభం

- తెలంగాణ శాసన మండలి నూతన భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీ ప్రాంగణంలోని పాత అసెంబ్లీ బిల్డింగ్‌లో ఇకపై మండలి సమావేశాలు
- రూ.30 కోట్లతో పాత భవనాన్ని ఆధునీకరించిన ప్రభుత్వం
- ఈసారి బడ్జెట్ సమావేశాలు ఈ కొత్త భవనంలోనే నిర్వహణ
- ఒకే ప్రాంగణంలో ఉభయ సభలు ఉండేలా రేవంత్ సర్కార్ నిర్ణయం

11లో






## బడా బాబులకు 'రాజ'భోగం..
# సామాన్యుడికి పన్ను 'పోటు'!

- సరూర్ నగర్ సర్కిల్ లో భారీ పన్ను గోల్‌మాల్.. 20 వేల చదరపు అడుగుల మాయ!
- అక్రమార్కులతో అధికారుల 'మందు' పార్టీలు.. చూసీచూడనట్లు వదిలేస్తున్న జోనల్ కమిషనర్?

11లో



## మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్...
# నేనే అంబాసిడర్‌గా ఉంటా

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన
- డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ



11లో

## గల్ఫ్ దేశాలపై ఇరాన్ భీకర దాడులు...
## కువైట్, సౌదీలలో ఉద్రిక్తత

11లో

భారత శక్తి®

## యుద్ధంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యమే

యుద్ధం ప్రకటించేది ముసలివారు, కానీ పోరాడి చనిపోయేది మాత్రం యువకులే " .. రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా అధ్యక్షుడుగా వ్యవహరించిన హెర్బర్ట్ హూవర్ చెప్పిన మాట. ఎందుకంటే యుద్ధం వినాశనాన్ని ఆయన కళ్లారా చూశారు మరి. ఇప్పుడు అదే అమెరికాకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ట్రంప్ దీన్ని నిజం చేస్తున్నారు. యుద్ధాలు చూసిన వారు .. యుద్ధాల్లో పాల్గొన్న వారు ఎవరైనా సరే చెప్పే మాట యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరనే. అయినా ఈ సూక్ష్మాన్ని అర్థం చేసుకునేంత విశాలమైన దృక్పధం లేని ట్రంప్ లాంటి నేతలే ప్రపంచాన్ని ఏలుతున్నారు. చరిత్ర పుటలను తిరగేస్తే కనిపించేది కేవలం రాజ్యాల విస్తరణో, వీరుల పరాక్రమమో కాదు.. ప్రతి యుద్ధం చివరన మిగిలిన శ్మశాన వైరాగ్యం. యుద్ధంలో విజేతలు ఉండరు.. కేవలం ప్రాణాలతో మిగిలిన వారు మాత్రమే ఉంటారు అన్నది జగమెరిగిన సత్యం. కానీ, దురదృష్టవశాత్తూ చరిత్ర నేర్పిన పాఠాలను విస్మరించడమే మానవజాతి అలవాటుగా మార్చుకుంది. ఖొమైనీని చంపేసినా విజయం దక్కలేదు చరిత్రలో యుద్ధాలు ఎప్పుడూ ఒక ముగింపును ఇవ్వలేదు, అవి కేవలం కొత్త అధ్యాయాలకు రక్తపాతంతో కూడిన ప్రారంభాలను మాత్రమే రాశాయి. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖొమైనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన నాయకత్వ నిర్మూలన ఆధునిక యుద్ధ తంత్రంలో ఒక సంచలనం కావచ్చు. కానీ, ఒక వ్యక్తిని లేదా ఒక వ్యవస్థ శిఖరాగ్రాన్ని తొలగించినంత మాత్రాన ఆ దేశంపై లేదా ఆ సిద్ధాంతంపై విజయం సాధించామనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని అనంతర పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇరాన్ వంటి దేశాల్లో అధికారం అనేది కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదు. దశాబ్దాలుగా అక్కడ నిర్మితమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, ఒక బలమైన మతపరమైన అధికార యంత్రాంగం, నాయకత్వం కోల్పోయినప్పుడు మరింత ఉధృతంగా స్పందిస్తాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. ఫలితంగా గల్ఫ్ దేశాలు తమ ఎడారి వంటి వాతావరణంలో ఎంతో కష్టపడి నిర్మించుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు ముప్పు ఏర్పడింది. శత్రువును నామరూపాలు లేకుండా చేయాలనే ఆకాంక్ష సిద్ధాంతపరంగా బాగుండవచ్చు కానీ, క్షేత్రస్థాయిలో అది అసాధ్యం. విత్తనాన్ని మట్టిలో పాతిపెడితే అది చనిపోదు, మరింత బలమైన వృక్షంగా మొలుస్తుంది. యుద్ధాల విషయంలో కూడా పగ, ప్రతీకారాలు అలాగే రూపాంతరం చెందుతాయి. ఖొమైనీ మరణం తర్వాత ఇరాన్ బలహీనపడిందని జరుగుతున్న పరిణామాలను చూసి ఎవరూ అనుకోవడంలేదు. ఒక కేంద్రీకృత నాయకత్వం లేనప్పుడు, ఆ వ్యవస్థలోని చిన్న చిన్న విభాగాలు స్వయంప్రతిపత్తితో విధ్వంసానికి తెగబడే ప్రమాదం ఉంది. ఇప్పుడు మనం చూస్తున్నట్లుగా, హోర్ముజ్ జలసంధి మూసివేత, అంతర్జాతీయ ఇంధన సరఫరాపై దాడులు, లెబనాన్ నుండి హిజ్బుల్లా ప్రయోగిస్తున్న క్షిపణులు.. ఇవన్నీ ఒక దేశాన్ని దెబ్బకొడితే ప్రపంచం మొత్తం ఎలా వణికిపోతుందో నిదర్శనాలు. విజేతగా నిలిచామని సంబరపడే లోపే, ఆర్థిక మాంద్యం , ప్రాంతీయ అస్థిరత అనే రూపాల్లో ఓటమి తలుపు తడుతోందని ఎప్పటికప్పుడు అనుభవమైన నిజం. యుద్ధంలో గెలిచిన వాడు కూడా ఓడిపోయిన వాడితో సమానమే, ఎందుకంటే ఇద్దరూ తమ ఆత్మీయులను కోల్పోతారు." అని శ్రీశ్రీమద్భాగవతంలో మనం చెప్పుకున్నాం. యుద్ధం ము గురించి చరిత్ర కేవలం గెలిచిన పక్షం పేరును మాత్రమే చెబుతుంది. కానీ ఆ గెలుపు కోసం చెల్లించిన మూల్యాన్ని ఎప్పుడూ విస్మరిస్తుంది. సరిహద్దుల మీద ఎగిరే జెండా ఆ దేశపు ఆత్మగౌరవానికి చిహ్నంగా కనిపించవచ్చు, కానీ ఆ జెండాను మోయాల్సిన యువతరం శ్మశానాల్లో కలిసిపోవడం ఏ విజయానికి సంకేతమనేది ఎవరు చెప్పగలరు? ఆధిపత్యం కోసం జరిగే ఈ పోరాటంలో అగ్రరాజ్యాలుగా వెలుగొందాలని చూసే దేశాలు, తమ భావి తరాల ఉనికినే పణంగా పెడుతున్నాయి. యుద్ధరంగంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యం మాత్రమే. ఆర్థికంగా బలపడటం కోసం లేదా భూభాగాల కోసం చేసే యుద్ధాలు, ఒక దేశపు వెన్నెముకను విరిచేస్తాయి. యుద్ధం వల్ల కలిగే విధ్వంసం కేవలం భవనాలకూ, ఆస్తులకూ పరిమితం కాదు. అది ఒక దేశపు ఆర్థిక మూలాలను, సామాజిక సమతుల్యతను దశాబ్దాల పాటు కుంగదీస్తుంది. యుద్ధం కోసం వెచ్చించే వేల కోట్ల నిధులు మానవాభివృద్ధికి ఉపయోగపడాల్సినవి, కానీ అవి వినాశనానికి ఖర్చవుతున్నాయి. ఈ ప్రక్రియలో కోల్పోయిన మానవ వనరులు, మేధస్సు మళ్ళీ పునరుద్ధరించలేనివి. విజేతగా నిలిచిన దేశం కూడా పతనమైన ఆర్థిక వ్యవస్థతో, గాయపడిన సమాజంతోనే మనుగడ సాగించాల్సి వస్తుంది. ఇప్పుడు అమెరికా,ఇజ్రాయెల్‌లకు రేపు యుద్ధం చేయాలనుకునే మరో దేశానికీ అదే పరిస్థితి వస్తుంది. ఆధునిక కాలంలో యుద్ధం అనేది కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, అది ఒక తరం మేధస్సును, సృజనాత్మకతను అణచివేసే చీకటి అధ్యాయం. యుద్ధం వల్ల కలిగే మానసిక గాయాలు, అస్థిరత సమాజంలో విద్వేష బీజాలను నాటుతాయి. మూడవ ప్రపంచ యుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో నాకు తెలియదు కానీ, నాలుగవ ప్రపంచ యుద్ధం మాత్రం రాళ్లు, రప్పలతో జరుగుతుంది.. ఐన్‌స్టీన్ చెప్పిన మాటను ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తున్న నేతలు గుర్తు తెచ్చుకోవాలి. చరిత్ర పుటల్లో తమ పేరు శాశ్వతంగా నిలిచిపోవాలనే కొందరు పాలకుల వ్యక్తిగత అహంకారం, నేడు లక్షలాది మంది సామాన్యుల జీవితాలను బలిపీఠం ఎక్కిస్తోంది. యుద్ధాన్ని ఒక దౌత్యపరమైన సాధనంగా కాకుండా, తమ ఉనికిని చాటుకునే ప్రచార అస్త్రంగా మార్చుకోవడం అత్యంత ప్రమాదకరం. డొనాల్డ్ ట్రంప్ వంటి నేతలు కూడా యుద్ధాల వల్ల కలిగే అపారమైన ఆర్థిక నష్టాన్ని, వనరుల దుర్వినియోగాన్ని ప్రస్తావిస్తున్నారంటే, యుద్ధం అనేది కేవలం ప్రాణ నష్టమే కాదు, ఒక దేశపు ఆర్థిక మూలాలను దెబ్బతీసే అత్యంత ఖరీదైన వ్యర్థం అని స్పష్టమవుతోంది. భవిష్యత్తులో రాబోయే ఊహాజనిత ముప్పులను అడ్డుకోవా లనే భ్రమలో, వర్తమానంలో ఉన్న శాంతిని, స్థిరత్వాన్ని పణంగా పెట్టడం పాలకుల విజ్ఞతకు నిదర్శనం కాదు, అది వారి రాజకీయ బాధ్యతారాహిత్యమే అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల ప్రథమ కర్తవ్యం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, కానీ క్షిపణుల ప్రయోగాలే పరాక్రమంగా భావిస్తున్నారు. వివేకవంతులైన పాలకులు యుద్ధాన్ని నివారించడంలోనే తమ గొప్పతనాన్ని వెతుక్కోవాలి తప్ప, యుద్ధాన్ని సృష్టించడంలో కాదు. యుద్ధాన్ని అంతం చేయకపోతే యుద్ధమే మనల్ని అంతం చేస్తుంది ! ఆధునిక ప్రపంచంలో పాలకులకు కావాల్సింది యుద్ధ క్షేత్రంలో ప్రదర్శించే పరాక్రమం కాదు, చర్చల విషయంలో ప్రదర్శించే దౌత్యనీతి. చరిత్రను అధ్యయనం చేయడం అంటే కేవలం గతంలో జరిగిన యుద్ధాల విజయగాథలను నెమరువేసుకోవడం కాదు.. ఆ ఘర్షణలు మిగిల్చిన రక్తపాతాన్ని, విధ్వంసాన్ని గుర్తించి, అటువంటి తప్పులు మళ్ళీ జరగకుండా చూడటం. శాంతిని కోరుకోవడం అంటే చేతకానితనం కాదు, అది ఒక పరిణతి చెందిన నాగరికతకు, అత్యంత శక్తివంతమైన నాయకత్వానికి నిదర్శనం. క్షిపణుల గర్జనల కంటే చర్చల ద్వారా లభించే పరిష్కారాలే సుస్థిరమైన భవిష్యత్తుకు బాటలు వేస్తాయి. ఈ సత్యాన్ని పాలకులు విస్మరిస్తే, వారు చరిత్రలో నిర్మాతలుగా కాకుండా విధ్వంసకారులుగా మిగిలిపోతారు. రేపటి తరం మన నుండి ఆశించేది కేవలం సాంకేతిక విప్లవం ,ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు, సురక్షితమైన , ప్రశాంతమైన జీవన వాతావరణాన్ని కూడా.

# ఏపీ లిక్కర్ స్కామ్ 3500 కోట్ల నష్టం..440 కోట్ల జప్తు

విజయవాడ, మార్చి 8

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రూ.441.63 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలు, బూనేటి చాణక్య, వాసుదేవ రెడ్డి బంధువులు, ఇతర వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రకారం స్వాధీనం చేసుకుంది. జప్తు చేసిన ఆస్తుల్లో బ్యాంకు నిల్వలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మద్యం విధానంలో అవకతవకల వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.4,000 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2019కి ముందు రాష్ట్రంలో మద్యం వ్యాపారం పారదర్శకంగా, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా నడిచేది. కొనుగోలు నుంచి విక్రయాల వరకు ప్రతి దశను డిజిటల్‌గా నమోదు చేసేవారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం రిటైల్ మద్యం దుకాణాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సమయంలో ఆటోమేటెడ్ వ్యవస్థను నిలిపివేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేసినట్టు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. దీంతో సరఫరా ఆర్డర్లు జారీ చేసే విషయంలో అధికారులకు విస్తృత స్వేచ్ఛ లభించిందని ఈడీ తెలిపింది. మాన్యువల్ విధానాన్ని ఉపయోగించి మార్కెట్‌లో ఉన్న కొన్ని ప్రముఖ మద్యం బ్రాండ్లను పక్కన పెట్టారని దర్యాప్తులో తేలింది. అదే సమయంలో కొందరు ఇష్టమైన బ్రాండ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సరఫరా ఆర్డర్లు మంజూరు



చేసినట్టు వెల్లడైంది. అదే పేర్లతో పోలి ఉండే కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి వాటి ధరలను కృత్రిమంగా పెంచారని ఈడీ పేర్కొంది. దీంతో డిస్టిలరీలకు అధిక లాభాలు వచ్చి అవి లంచాల రూపంలో తిరిగి సిండికేట్ సభ్యులకు చేరినట్టు వెల్లడయింది. సరఫరా ఆర్డర్లు పొందేందుకు డిస్టిలరీలు ఒక్కో కేసు ధరలో 15 నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్‌లు చెల్లించాల్సి వచ్చిందని దర్యాప్తులో తేలింది. చెల్లించేందుకు నిరాకరించిన తయారీదారులపై ఒత్తిడి తెచ్చి చెల్లింపులు నిలిపివేయడం, ఆర్డర్లు తిరస్కరించడం వంటి చర్యలు తీసుకున్నట్టు వెల్లడైంది. ఈ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని దాచేందుకు ఎన్‌క్రిప్టెడ్ వాయిస్ కాల్స్, సిగ్నల్ వంటి యాప్‌లను ఉపయోగించినట్టు ఈడీ తెలిపింది. ఇందులో బూనేటి చాణక్య , ముప్పిడి అవినాష్ అలియాస్ సుమిత్, మహ్మద్ సైఫ్ వంటి వారు కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని సిండికేట్ రాష్ట్రంలో మద్యం కొనుగోలు?పంపిణీ వ్యవస్థను ప్రభావితం చేసి బహుకోట్ల కుంభకోణం నిర్వహించినట్టు ఈడీ పేర్కొంది. ంఖూఃఅఒ కొనుగోలు ప్రక్రియలో జోక్యం చేసి రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.3,500 కోట్ల నష్టం కలిగించినట్టు దర్యాప్తులో తేలింది. సిండికేట్ సభ్యులు కిక్‌బ్యాక్‌ల రూపంలో సుమారు రూ.3,500 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది. కొన్ని డిస్టిలరీలను నియంత్రణలోకి తీసుకుని వాటి ద్వారా అక్రమ ఆదాయం సృష్టించినట్టు ఈడీ తెలిపింది. అదాన్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, లీలా డిస్టిలరీలు, యూ.వి. డిస్టిలరీలు వంటి సంస్థలకు అధిక వ్యాపారం కల్పించినట్టు పేర్కొంది. మద్యం రవాణా టెండర్‌ను సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించి గతంతో పోలిస్తే ఎక్కువ ధరలు చెల్లించినట్టు కూడా వెల్లడించింది. ఆ కాంట్రాక్టు ఆదాయంలో కొంత భాగాన్ని ఇతర సంస్థల ద్వారా మనీలాండరింగ్ చేసినట్టు గుర్తించింది. కొన్ని డిస్టిలరీలు ముడిసరుకు, ప్యాకేజింగ్ సరఫరా పేరుతో కల్పిత కంపెనీలను ఉపయోగించి నిధులను నగదుగా మార్చినట్టు ఈడీ తెలిపింది. ఈ అక్రమ నిధులను భూములు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి మార్గాల్లో పెట్టుబడిగా మార్చినట్టు వెల్లడించింది. ఇందుకోసం ఈశాన్వి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఈడి ఎంటర్‌టైన్‌మెంట్, యూని కార్పొరేట్ సొల్యూషన్స్, ట్యాగ్ డెవలపర్స్ వంటి సంస్థలను వినియోగించినట్టు తెలిపింది. కొనుగోలు, సరఫరా విధానాలను ప్రభావితం చేసి సిండికేట్ నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అక్రమ ఆదాయం పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నగదు కిక్‌బ్యాక్‌లను హైదరాబాద్‌లోని వివిధ ప్రదేశాల్లో నిల్వ ఉంచినట్టు కూడా గుర్తించింది. ఇప్పటివరకు దర్యాప్తులో రూ.1,048.45 కోట్ల మనీ ట్రైల్ గుర్తించినట్టు ఈడీ వెల్లడించింది. ఇందులో నగదు, బంగారం రూపంలో చెల్లించిన కిక్ బ్యాక్ లు, డిస్టిలరీల నియంత్రణ, మద్యం రవాణా ద్వారా వచ్చిన లాభాలు ఉన్నాయి. ఈ అక్రమ ఆదాయంతో ఆస్తులు కొనుగోలు చేసి వ్యక్తిగత లాభాల కోసం వినియోగించినట్టు తేలింది. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

# అంతా ఫీల్ గుడ్ కాదా..

విజయవాడ, మార్చి 8

కృష్ణా జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ వివాదాలకు ఎట్టకేలకు తెరపడింది. కొలికపూడితో మంతెన సత్యనారాయణ రాజు భేటీ అయి, పార్టీలో దీనిపై ఉన్న సీరియస్ నెస్, రాజకీయంగా కలిగే నష్టాలను చర్చించారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి మధ్య కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించారు. అనంతరం ఈ వివాదాలపై తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్పందించారు. తిరువూరులో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలన్నీ ముగిసినట్లేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పరిణామాలు పార్టీ ప్రతిష్టకు ఏవైనా ఇబ్బందులు కలిగించి ఉంటే తాను చింతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు మళ్లీ రిపీట్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అధికార ప్రోటోకాల్, పరస్పర గౌరవం గురించి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఖచ్చితంగా ఇస్తానని, అదే సమయంలో ఆయన నుంచి కూడా తాను అదే గౌరవాన్ని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును వాడటం తన అభిమతం కాదని, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన ప్రాణాలకు ముప్పు ఉందని గురువారం ఆరోపించారు. నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణోత్సవం సందర్భంగా జరిగిన ఘటనను ఉటంకిస్తూ, తనపై దాడి చేసి చంపేందుకు పక్కా ప్రణాళిక జరిగిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీ కార్యాలయం నుంచే మధ్యాహ్నం నుండి జనాన్ని సమీకరించాలని ఆదేశాలు వెళ్లాయని, తనను లక్ష్యంగా చేసుకుని ఈ కుట్ర పన్నారని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ అధిష్టానం స్పందించింది. ఇది వ్యక్తిగతంగానే కాదు, పార్టీకి నష్టం కలిగిస్తుందని.. విభేదాలు మంచిది కాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగం తీరుపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిఘా వర్గాల ద్వారా తన గన్ మెన్‌కు ముందస్తు హెచ్చరికలు అందినప్పటికీ, తనకు కనీసం ఒక అదనపు కానిస్టేబుల్‌ను కూడా భద్రతగా కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. నెమలి వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణం సమయంలో కరెంట్ తీసివేసి చీకట్లో తనపై దాడి చేయాలని ప్లాన్ చేశారని, అయితే పోలీసులు అందుకు నిరాకరించడం వల్ల ప్రమాదం తప్పిందని తనకు సమాచారం ఉందని ఆయన వెల్లడించారు. తన కారు అద్దాలు పగలగొట్టి, టైర్ల గాలి తీసి తనను అడ్డుకుని భౌతిక దాడి చేయాలని చూశారనే స్పష్టమైన ఆధారాలు తన వద్ద ఉన్నాయని కొలికపూడి శ్రీనివాసరావు మీడియాతో చెప్పారు. ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే అయ్యుండి కూడా తనకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు తిరువూరు నియోజకవర్గంలో రాజకీయ ఉత్కంఠను మరింత పెంచాయి.

# పెళ్లిళ్లు..ఓదార్పులేనా

కడప, మార్చి 8

గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా వెళ్లి బాధితుల్ని పరామర్శించేవారు. కానీ ఇప్పుడు ఆయన రూట్ మారిపోయింది. ఘోర విషాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను ఓదార్చడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. పార్టీ నేతలు అరెస్టు అయితే యాత్రగాతో వెళ్లి పరామర్శలు చేస్తున్నారు. అదికూడా కొంత మంది కే. మిగిలిన వారిని ఇంటికి పిలిపిచుకుని ఓదారుస్తున్నారు. ఇక ప్రజాసమస్యలు.. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే మాత్ర అసలు వెళ్లడం లేదు. ఈ నెలలో రెండు, మూడు ఘోర విషాదాలు ఏపీలో జరిగాయి. ఒకటి కల్తీ పాల విషాదం, రెండు బాణసంచా విషాదం. ఉత్తరాంధ్రలో డయేరియా వల్ల కూడా కొంతమంది చనిపోయారు. సాధారణంగా ఇలాంటివి జరిగినప్పుడుప్రతిపక్ష పార్టీలు హడావుడి చేస్తాయి. కానీ జగన్మోహన్ రెడ్డి అసలు పట్టించుకోలేదు జగన్ పరామర్శలు చేస్తారని వైసీపీ వర్గాలు అనుకున్నా.. ఈ వారం ఆయన పెళ్లిళ్లకు మాత్రమే పరిమితమయ్యారు. గత రెండేళ్లుగా జగన్ చేస్తున్నది ఇదే. వైసీపీ ఓడిపోయిన తర్వాత జగన్ రాజకీయం పూర్తిగా విజిటింగ్ ప్రొఫెసర్ తరహాలో జరుగుతోంది. వారానికి మూడు, నాలుగు రోజులు మాత్రమే తాడేపల్లిలో ఉంటున్నారు. బుధవారం వచ్చి శుక్రవారం బెంగళూరుకు వెళ్లిపోతున్నారు. ఈ సమయంలో ఓ ప్రెస్మీట్ లేకపోతే పార్టీ నేతలతో సమావేశం సందర్భంగా మాట్లాడి ఆ వీడియోలను విడుదల చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లిన సందర్భాలు తక్కువ. ఓ సారి చిత్తూరులో మామిడి రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లారు. ఆ తర్వాత పార్టీ నేతల ఇళ్లకు పరామర్శలకే వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి తన పర్యటనలను ఎక్కువగా రాజకీయ కారణాలకే పరిమితం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత జగన్ వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా



ప్రజలు తిరస్కరించారన్న భావనలో జగన్ ఉన్నారని .. ఆ అసంతృప్తి ఆయనలో ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే జగన్ స్వయంగా తనకు నలభై శాతం ఓటు బ్యాంక్ ఉందని చెబుతూ ఉంటారు. ఆ కోణంలోనే ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన ప్రతిపక్ష హోదాలో ఉండి కూడా, ఆయన కేవలం ప్రెస్ నోట్లు, సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కావడం పార్టీ క్యాడర్ ను అసంతృప్తికి గురి చేస్తోంది. అయితే వైసీపీ పెద్దలు మాత్రం మరో విధంగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైకాపా నాయకులపై కేసులు బనాయిస్తోందని, వారిని కాపాడుకోవడమే ప్రస్తుతానికి ప్రాధాన్యత అని జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో గెలిచిన దగ్గర నుండే జగన్ జనంతో నేరుగా మమేకం అవ్వడం తగ్గించారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నాయి. ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా అదే ధోరణి కొనసాగించడం రాజకీయంగా ఆత్మహత్యాసదృశ్యమేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఒకప్పుడు ఓదార్పు యాత్ర పేరుతో ఊరూరా తిరిగిన జగన్, ఇప్పుడు అదే ప్రజలు కష్టాల్లో ఉంటే వెళ్లడానికి వెనకాడుతుండటం ఆయన ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. అయితే జగన్ మూడేళ్ల పాటు ప్రజా సమస్యలను పట్టించుకోకూడదని..చివరి రెండేళ్లు పాదయాత్ర చేస్తారు కాబట్టి అంతా కవర్ అయిపోతుదంని పార్టీ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రజలు ఆయన మూడేళ్లు ఏం చేశారన్నది మర్చిపోతారని. చివరి రెండేళ్ల పోరాటంతోనే ఓట్లేస్తారని అంటున్నారు.

# విజయవాడ విద్యాధరాపురం లో దారుణం

## మూడు సంవత్సరాల పాప పై యాసిడ్ పోసిన స్కూల్ టీచర్

## ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

విజయవాడమార్చి 8

విజయవాడ విద్యాదారపురం నేషనల్ ప్లే స్కూల్ లో టీచర్ చేసిన నిర్వాకం ఆలస్యంగా బయటపడింది. ఫిబ్రవరి 23 వ తారీకు పాపను నేషనల్ స్కూల్ దగ్గరపాపను తల్లీ దింపింది. కాసేపటికి స్కూల్ నుంచి పాప బాతురూమ్ లో పడిపోయింది అని తల్లి కి ఫోన్ వచ్చింది. వెంటనే పాప తల్లీ, అక్క స్కూల్ కి వచ్చి ఏడుస్తూ ఉన్న పాపని హాస్పిటల్ కి తీసుకువెళ్లారు . పాపను హాస్పిటల్ కు తీసుకువెళ్తే నిజాలు బయటపడ్డాయి. తల్లిదండ్రులు స్కూల్ దగ్గర కు వెళ్లి స్కూల్ యజమానాన్ని గట్టిగా అడుగగా నిజం స్కూల్ యాజమాన్యం ఒప్పుకుంది. హాస్పిటల్ లో బిల్లు కట్టి చేతులు దులుకుకుంది. తరువాత కొంత డబ్బులు ఇచ్చి రాజీకి రమ్మని స్కూల్ యాజమాన్యం చెప్పింది. తల్లిదండ్రులు ఒప్పుకోవకపోవడం తో బెదిరింపులకు దిగింది. ఈ విషయాలు బయటకు చెప్తే మీ అంతుచుస్తాను అంటూ ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు వార్నింగ్ ఇచ్చారు. డీసీపీ తమ చుట్టం అంటూ తల్లిదండ్రులకు బెదిరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తమ కూతురిపై ఇంత కూరాత్మకంగా గాయపరిచిన వారిని శిక్షించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

## గ్యాస్ ధరల పెంపు

న్యూఢిల్లీ మార్చి 8

అమెరికా ఇరాన్ యుద్ధం ప్రభావం మన దేశంపై ప్రభావం గట్టిగానే పడుతోంది. అంతర్జాతీయంగా ముడిచమురు రవాణాకు ఆటంకం ఏర్పాడిన నేపథ్యంలో దేశంలో చమురు ధరల పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది.. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తక్షణం కొత్త రెట్లు అమలులోకి రానున్నాయి. కమర్షియల్ సిలిండర్ ధర రూ.115, వంట గ్యాస్ ధర రూ.60 పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం ప్రకటించింది. హైదరాబాద్ లో వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపు తర్వాత రూ.965 గా ఉంటుంది. ఉజ్వల స్కీమ్ సిలిండర్ ధర విషయంలో ఎలాంటి మార్పు ఉండదని కేంద్రం తెలిపింది. పెట్రోల్ డీజిల్ ఇతర గ్యాస్ ధరలు కూడా పెరిగే అవకాశముంది.. దేశంలో చమురు నిల్వలు ఇరవై రోజుల్లో అడుగంటే పరిస్థితి ఉందని సమాచారం.

## రాష్ట్రవ్యాప్తంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు

అమరావతి వార్చి 8

రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా శనివారం "మెగా కార్డన్ డే" నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ రోజు తెల్లవారినుండే ప్రత్యేక తనిఖీలు చేపట్టబడ్డాయి. ఆపరేషన్ వజ్రప్రహార్ మెగా కార్డన్ అండ్ సెర్చ్ మొదటి రోజు ప్రారంభం సందర్భంగా, ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ ఏకే రవికృష్ణ,ఇతర సీనియన్ అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలకు గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.

# కమలం చేతికి బీహార్

పాట్నా, మార్చి 8

బిహార్‌లో రాత్రికి రాత్రి రాజకీయం మారిపోయింది. పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకరారం చేసి 21 ఏళ్లుగా బిహార్‌కు దశ దిశ నిర్దేశించిన నితీశ్‌కుమార్ రాజకీయం రాష్ట్రంలో ముగిసింది. రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మార్చి 5న నామినేషన్ వేశారు. నితీశ్‌కుమార్ ఢిల్లీ రాజకీయాలకు వెళ్లనున్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు అన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రిగా ఆయన పూర్తికాలం ఉంటారని ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. కానీ 5వ తేదీన నితీశ్‌కుమార్ ట్విట్టర్‌లో ఒక పోస్టు పెట్టారు. రాజ్యసభకు నామినేసన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు.మార్చి 4న వన్ ఆన్ మాల్ భవనంలో జరిగిన కీలక సమావేశం నితీశ్ నిర్ణయానికి మూలం. కేంద్ర మంత్రులు సంజయ్ ఝా, రామ్‌నాథ్ ఠాకూర్, విజయ్ కుమార్ చౌహాన్, బిజేంద్ర యాదవ్ పాల్గొన్నారు; అమిత్ షా ఫోన్‌లో చేరి ఆరోగ్యం, పరిపాలనా సవాళ్లపై చర్చించారు. ఇటీవల ఆయన వ్యవహార శైలి మార్పు, మతి సమస్యల ప్రచారం, ఐఏఎస్ అధికారుల ప్రభావం ప్రజల్లో అసంతృప్తి తెచ్చాయి. మార్చి 5న ఎక్స్ పోస్ట్‌లో రాజ్యసభ ప్రయాణాన్ని ప్రకటించారు. నితీశ్ కుమారుడు 40 ఏళ్ల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ నిశాంత్ కుమార్‌ను ఉపముఖ్యమంత్రిగా చేసి పార్టీ ఐక్యత కాపాడాలని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి. రాజకీయ అనుభవం లేనప్పటికీ, తండ్రి వెంట తిరుగుతూ క్రమంగా ప్రజాధరణ సంపాదించాలని ప్రణాళిక. కుటుంబ పాలనకు వ్యతిరేకత ఉన్నా, పార్టీ స్థిరత్వం కోసం ఈ దీర్ఘకాల ప్రణాళిక రూపొందుతోంది. జేడీయూ శ్రేణులు నిశాంత్ ప్రజాధరణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఇక బీజేపీ ఖాతాలో మరో రాష్ట్రం రాబోతోంది.

ప్రస్తుత ఉపముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి (నితీశ్ సమాజిక వర్గనేత), నిత్యానంద రాయ్ యాదవ్, దిలీప్ సైస్వాల్, విజయ్ కుమార్ సిన్హా సీఎం అవకాశాల్లో ముందున్నారు. బీజేపీ ఆధారంతో జేడీయూ మద్దతు ప్రభుత్వ ఏర్పాటుకు దారితీస్తుంది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఇది నితీశ్ స్వచ్ఛంద నిర్ణయమని, భవిష్యత్ ప్రభుత్వానికి ఆయన మార్గదర్శకత్వం ఉంటుందని తెలిపారు. రాజ్యసభ స్థానం జేడీయూ ప్రభావాన్ని కొనసాగిస్తుందని ఆశ.అసెంబ్లీలో 249 స్థానాల్లో బీజేపీ 89, జేడీయూ 86, రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ 19, ఆర్‌ఎల్‌జేపీ 4 సాధించాయి. ఆర్‌ఎల్‌జేపీ బీజేపీలో విలీనం ప్రణాళిక ఆర్‌జేడీ చీల్చే అవకాశాన్ని అడ్డుకుంటుంది. ఈ మలుపుతో బీజేపీ మరో రాష్ట్రంలో సీఎం పదవి సాధించనుంది. రోహిణి ఆచార్యలు నితీశ్‌ను బీజేపీ 'కీలుబొమ్మ'గా విమర్శిస్తూ, మిత్రద్రోహానికి మూల్యం చెల్లించారని ఆరోపించారు. ఈ పరిణామం బీజేపీ బలోపేతానికి జేడీయూ బలహీనతకు దారితీస్తోంది.

# చివరి దశకు కగార్

హైదరాబాద్, మార్చి 8

దేశంలో మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ దాదాపు విజయవంతమైంది. ఇప్పటికే వందల మంది ఎన్‌కౌంటర్లలో మరణించారు. భారీగా లొంగుబాట పట్టారు. అగ్రనేతలు కూడా లొంగిపోతుండడంతో కిందిస్థాయి కేడర్ కూడా వారిని అనుసరిస్తోంది. ఇక తెలంగాణలో ఇప్పటికే అగ్రనేతలు లొంగిపోయారు. మిగిలిన ఒక్క అగ్రనేత కూడా అదేబాట పట్టనున్నారు. దీంతో మావోయిస్టుల శకం ముగియనుంది.కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చల్లో రాష్ట్ర డీజీపీ సహా అధికారులు మావోయిస్టు పరిస్థితిని వివరించారు. దశాబ్దాల సాయుధ సంఘర్షణకు కట్టుమిసేందుకు రెండు ప్రభుత్వాలు సమన్వయం పెంచుకున్నాయి. మార్చి 31 నాటికి తెలంగాణను మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటించే లక్ష్యంతో పునరావాస పథకాలపై ఏకాభిప్రాయం ఏర్పడింది.వృద్ధాప్యం, అనారోగ్యాలతో బాధపడుతున్న మావోయిస్టు మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు (గణపతి) సమస్త్రవంతంలో చేరేందుకు సిద్ధత చూపుతున్నారు. తెలంగాణ ఇంటెలిజెన్స్ మధ్యవర్తిత్వంతో జరిగిన రహస్య చర్చలు తుది దశలో ఉన్నాయి. నేపాల్ నుంచి ఢిల్లీకి చేరినట్లు ప్రచారాలు ఆయన లొంగుబాటును దేశవ్యాప్త చర్చనీయాంశంగా మార్చాయి.ఉమ్మడి ఆపరేషన్లు, ఎన్‌కౌంటర్లతో ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, తిప్పిరి తిరుపతి, మల్ల రాజిరెడ్డి వంటి నాయకులు కోల్పోవడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. దండకారణ్యంలోంచి కార్యకర్తలు జనజీవనంలోకి తిరిగి వస్తున్నారు. గణపతి ఏకైక మిగిలిన నాయకుడిగా మిగిలిపోవడంతో సంస్థాగత దెబ్బ ఎక్కువైంది.గణపతి లొంగుబాటు మావోయిస్టు ఉద్యమానికి ముగింపు గుర్తుగా నిలుస్తుంది, ఎందుకంటే 1970 నుంచి జగిత్యాల జైత్రయాత్ర, పీపుల్స్ వార్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. రాష్ట్రంలో అడవుల్లో ప్రశాంతత స్థిరపడి, అంతర్గత భద్రతా సవాళ్లు తగ్గుతాయి. పునరావాస ప్యాకేజీలు మిగిలిన క్యాడర్‌ను ప్రోత్సహిస్తాయి.తెలంగాణలో మావోయిజం అంతం కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నక్సలిజం ముగింపు లక్ష్యాన్ని సాకారం చేస్తుంది. ఇది దక్షిణ మావోయిస్టు జోన్‌లో బలహీనతకు దారితీసి, దేశ భద్రతా వ్యవస్థకు ఆశాదాయక సంకేతం. భవిష్యత్ పోరాటాలకు పాఠాలుగా నిలుస్తుంది.

# 14 దేశాలకు పాకిన యుద్ధం

న్యూయార్క్, మార్చి 8

మిడిల్ ఈస్ట్‌లో అమెరికా పెట్టిన చిచ్చు క్రమంగా రగులుతోంది. మొదట ఇరాన్‌పై అమెరికా ? ఇజ్రాయెల్ దాడులతో యుద్ధమ మొదలైంది. తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా మట్టుబెట్టడంతో ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. అయితే ఈ దాడులు ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా బేస్‌లు ఉన్న గల్ఫ్ దేశాలపై వైమానికి దాడులు చేసింది. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, ఓమన్, టర్కీ తదితర దేశాలపై ఇరాన్ మిస్సైల్ దాడులు చేస్తోంది. యుద్ధం ప్రారంభించి ఏడు రోజులైంది. మూడు దేశాలతో మొదలైన యుద్ధం ఇప్పుడు 14 దేశాలకు విస్తరించింది. ఇప్పుడు ఇరాక్, కువైట్, యూఏఈ, బహ్రెయిన్, ఖతర్, జోర్డాన్, అజర్‌బైజాన్, ఒమాన్, సౌదీ అరేబియా, లెబనాన్, సైప్రస్ వంటి 14 దేశాలను యుద్ధం చుట్టుముట్టింది.చర్చలు లేకపోవడంతో యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. రష్యా?ఉక్రెయిన్ యుద్ధంలాగా ఈ ఘర్షణ కూడా సంవత్సరాలు పట్టే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం విస్తరించేందుకు అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తుంది. మరోవైపు అమెరికా?ఇజ్రాయెల్ ఇరాన్‌ను వీలైనంత త్వరగా కట్టడికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్‌కు ప్రాక్సీ దళాలు (హిజ్బుల్లా, హౌతీలు) దీర్ఘకాల పోరాటానికి అనుకూలం. అమెరికా, ఇజ్రాయెల్ ఆధునిక ఆయుధాలతో పైచేయి సాధిస్తున్నా, ప్రాంతీయ మద్దతు బలహీనత కలిగిస్తోంది. చైనా కూడా ఇరాన్ సార్వభౌమాధికారం కాపాడతామని ప్రకటించింది. దీంతో చైనా కూడా యుద్ధ రంగంలోకి దిగే అవకాశాలు ఉత్కంఠ రేపుతున్నాయి.ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న రష్యా, వాణిజ్య భాగస్వామి చైనా రంగంలోకి దిగితే పరిస్థితి ప్రపంచ యుద్ధ స్థాయికి చేరుకుంటుంది. రష్యా డ్రోన్‌లు, మిస్సైల్ సాంకేతికత ఇచ్చి ఉక్రెయిన్ మోడల్‌ను పునరావృతం చేయవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిడి, ఓసియాన్ మార్గాల్లో జోక్యం చేస్తే అమెరికా శక్తి విభజన అవుతుంది. ఇది నాటో, అరబ్ మిత్రుల మధ్య వైరుధ్యాలను పెంచుతుంది.తక్షణ శాంతి ఒప్పందాలు లేకపోతే యుద్ధం రెండేళ్లు కొనసాగవచ్చు. ఐరోపా, ఐక్యరాష్ట్ర సమితి మధ్యవర్తిత్వం జరిగితే మాత్రమే మొదటి దశలో ఆగిపోతుంది. ఆర్థిక సంక్షోభాలు, ఆంతరిక అశాంతి ద్వారా కూడా యుద్ధం ఆగే అవకాశం ఉంది. అయితే, ప్రాంతీయ అస్థిరత భవిష్యత్ దశాబ్దాల్లో కొనసాగుతుంది.

# భారత్ కు అండగా రష్యా

న్యూఢిల్లీ, మార్చి 8

ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ కారణంగా ఇంధన సరఫరాకు ఆటకం ఏర్పడింది. ఇరాన్ ఆర్మూజ్ జలసంధిని మూసివేసింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వందలాది నౌకలు నిలిచిపోయాయి. మరోవైపు ఇరాన్ దాడితో గల్ఫ్ దేశాల్లో ఆయిల్ ఉత్పత్తి, సరఫరాకు అంతకాయం కలిగింది. దీంతో ప్రపంచంలో అతిపెద్ద ఆయిల్ దిగుమతిదారులు అయిన చైనా, భారత్‌తోపాటు యుపోపియన్ యూనియన్‌పై ప్రభావం పడనుంది. ఇప్పటికే ఆయిల్ ధరలు పెరిగాయి. ఈ ప్రభావం భారత్, చైనాపై ఎక్కువగా ఉండనుంది. దీంతో ఈ రెండు దేశాలు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నాయి.భారత్ తన ఇంధన అవసాల్లో 85 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. ఇందులో 60 శాతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతుంది. ఆర్మూజ్ జలసంధి మూసివేసిన నేపథ్యంలో ఈ 60 శాతం దిగుమతి నిలిచిపోయింది. ప్రస్తుతం దేశంలో 20 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ దిగుతులపై భారత్ గల్ఫ్ దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. మరోవైపు రష్యాతో చర్చలు జరుపుతోందియుద్ధం కారణంగా ఏర్పడిన ఆయిల్ కొరతను తీర్చేందుకు రష్యా ముందుకు వచ్చింది. అతిపెద్ద చమురు దిగుమతిదారులు అయిన భారత్, చైనాకు అవసరమైన ఆయిల్ సరఫరాకు సిద్ధమని తెలిపింది. లోటు చమురును తామే పూడుస్తామని వెల్లడించింది. అమెరికా ఒత్తిడితో ఇటీవలే భారత్ రష్యా ఆయిల్ దిగుమతి తగ్గించింది. కానీ ప్రస్తుత యుద్ధ పరిస్థితులతో అమెరికా ఒత్తిడిని పక్కన పెట్టింది. దేశ అవరసాలకే ప్రాధాన్యం ఇచ్చింది. రష్యా ఆయిల్ దిగుమతులు పెంచేందుకు సిద్ధమైంది.

# అజార్ ను ముంచుతారా... ఉంచుతారా..

హైదరాబాద్, మార్చి 8




తెలంగాణకు కొత్త గవర్నర్ వచ్చారు. ముగ్గురు గవర్నర్లు మారినా ప్రొఫెసర్ కోదండ రాం ఎమ్మెల్సీ పదవి మాత్రం ఇంకా ఊగిసలాటలోనే వుంది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజారుద్దీన్ కూడా ఎమ్మెల్సీగా ఎన్నికవడానికి గడువు దగ్గరపడుతోంది. వారి పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తూ రాష్ట్ర క్యాబినెట్ చేసిన సిఫారసులు ఈ గవర్నరైనా ఆమోదించి చట్టసభ సభ్యులయ్యే అవకాశమిస్తారో లేదో అనే టెన్షన్ కాంగ్రెస్‌లో కనిపిస్తోంది. తెలంగాణ జేఏసీ కన్వీనర్, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం శాసన మండలిలో అడుగుపెట్టే అదృష్టం చాలా కాలంగా ఊగిసలాడుతూ వస్తోంది. రెండు సార్లు ప్రభుత్వం ఆయన అభ్యర్థిత్వాన్ని గవర్నర్ కు సిఫారసుచేసినా, గవర్నర్ ఓసారి ఆమోదించినా న్యాయపర చిక్కులు ఆయన ప్రమాణస్వీకారానికి అడ్డుపడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్ ను, కుర్ర సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా సిఫారసులు పంపింది. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ వారి పేర్లను తిరస్కరించారు. ఇద్దరికీ రాజకీయ పార్టీతో ప్రత్యక్ష సంబందాలున్నాయనీ, ఏ రంగంలోనూ నిష్ణాతులు కాదు కాబట్టి ఆ పేర్లను తాను ఆమోదించలేనని చెప్పారు. ఇంతలో కేసీఆర్ ప్రభుత్వం మారి రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చింది. గవర్నర్ నిర్ణయం పై దాసోజు హైకోర్టును ఆశ్రయించారు. క్యాబినెట్ చేసిన సిఫారసులను తిరస్కరించే అధికారం గవర్నర్ కు ఉండదని హైకోర్టులో పిటిషన్ లో పేర్కొన్నారు.2023 డిసెంబర్ లో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత సిఫారసులను వెనక్కు తీసుకుని కొత్తగా ప్రొఫెసర్ కోదండరాం, పాత్రికేయుడు అమిర్ అలీ ఖాన్ లను ఎమ్మెల్సీగా ప్రతిపాదించారు. ఈసారి గవర్నర్ వారి పేర్లకు ఆమోదం కూడా తెలిపారు. దాసోజు శ్రవణ్ పిటిషన్ ను విచారించిన హైకోర్టు 2024 మార్చిలో గవర్నర్ తమిళిసై నిర్ణయాన్ని తప్పుపట్టింది. గవర్నర్ కు క్యాబినెట్ సిఫారసులను తిరస్కరించే అధికారం లేదని చెప్తూ కోదండరాం, అమిర్ అలీ ఖాన్ ల నామినేషన్ చెల్లదని చెప్పింది. హైకోర్టు నిర్ణయం పై సుప్రీం కోర్టు మొదట స్టే ఇచ్చింది. దీంతో ప్రక్రియ మళ్లీ మొదలైంది, ఈసారి రాష్ట్ర ప్రభుత్వం కోదండరాం, అజరుద్దీన్ ల పేర్లను గవర్నర్ కోటాకింద సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు 2025 ఆగస్టులో మునుపటి వ్యాఖ్యలపై తదుపరి వివరణ ఇస్తూ ప్రభుత్వ సిఫారసు చేసిన పేర్లకు నిబంధనలు పాటిస్తూ గవర్నర్ ఆమోదం తెలిపినా అది కోర్టు తుది తీర్పునకు లోబడే చెల్లుబాటవుతుందని చెప్పింది.సుప్రీకోర్టు తుది తీర్పునకు లోబడే అనే నిబంధన నేపధ్యంలో అప్పటి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏ నిర్ణయం తీసుకోకుండా ఉన్నారు. మరి ఇప్పుడు నూతన గవర్నర్ గా శివ్ ప్రతాప్ శుక్లా ఆధ్యతలు చేపట్టనున్న నేపధ్యంలో ఈయన ఏంచేస్తారు. కొత్త గవర్నర్ ను ఒప్పించి ఆమోదించుకోవడంలో రేవంత్ సఫలీకృతులవుతారా.. లేదా మూడో సారి కోదండరాం పేరును సిఫారసు చేయాల్సుంటుందా. జారుద్దీన్ విషయంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఆయన ప్రస్తుతం శాసనసభలో కానీ, మండలిలో కానీ సభ్యుడు కాకుండానే అక్టోబర్ 31, 2025 న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగం ప్రకారం, మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల లోపు ఆయన ఏదో ఒక సభలో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలి. ఒకవేళ కొత్త గవర్నర్ కూడా ఈ ఎమ్మెల్సీ నామినేషన్‌ను ఆమోదించకపోతే లేదా జాప్యం చేస్తే, గడువు ముగిసిన తర్వాత అజారుద్దీన్ తన మంత్రి పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది.మరోవైపు, ప్రొఫెసర్ కోదండరాం పేరు కూడా అనేక మలుపులు తిరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో సిఫార్సు చేసిన పేర్లను గవర్నర్ తిరస్కరించడం, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరాం పేరును ప్రతిపాదించడంపై కోర్టుల్లో కేసులు నడిచాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఈ నియామకాలపై స్టే లేదని స్పష్టం చేసినప్పటికీ, గవర్నర్ సంతకం పెడితేనే అది అధికారికం అవుతుంది. ప్రభుత్వం తన మిత్రపక్ష నేత అయిన కోదండరాంను పెద్దల సభకు పంపడం ద్వారా కీలక రాజకీయ సందేశం ఇవ్వాలని భావిస్తోంది.కొత్త గవర్నర్ ప్రభుత్వం పంపిన సిఫార్సులను యథాతథంగా ఆమోదిస్తే రేవంత్ రెడ్డి సర్కార్‌కు పెద్ద ఊరట లభిస్తుంది. ఒకవేళ గవర్నర్ మళ్ళీ ఏవైనా కొర్రీలు పెడితే మాత్రం, అది ప్రభుత్వం వర్సెస్ రాజ్‌భవన్ వివాదానికి దారితీయడమే కాకుండా, మైనారిటీ కోటాలో మంత్రిగా ఉన్న అజారుద్దీన్ పదవికి ఎసరు తెచ్చే అవకాశం ఉంది. మార్చి 19న సుప్రీంకోర్టులో ఈ విషయమై తదుపరి విచారణ ఉండటంతో, ఆలోపే గవర్నర్ నిర్ణయం వెలువడుతుందో లేదో వేచి చూడాలి.ఇప్పటికే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి చట్టసభ సభ్యుడయ్యేందుకు నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్న అజర్ భవితవ్యం ఏంటనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. దాసోజు శ్రవణ్ మాత్రం మా పిటిషన్ పండింగ్ లో వుండగా కొత్త గవర్నర్ కూడా ఆమోదం తెలపలేరంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే మంత్రి పదవికి అజర్ అర్హత కోల్పోయే ప్రమాదం పొంచివున్నట్టే.

# హస్తిన కాలింగ్...

హైదరాబాద్, మార్చి 8

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీకి పిలవడం ఇప్పుడు హస్తం పార్టీలోనే కాదు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మొన్న వికారాబాద్‌లో పర్యటించిన రాహుల్ గాంధీ..స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఢిల్లీ వచ్చి కలవమని చెప్పారట. పార్టీ శిక్షణా తరగతుల వేదికైన వికారాబాద్ నియోజకవర్గానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేగా ఉన్నారు. దీంతో ఆయన రాహుల్ గాంధీకి స్వాగతం పలకడంతో పాటు వీడ్కోలు చెప్పేందుకు హెలిప్యాడ్ దగ్గరికి వెళ్లిన సందర్భంగా..ప్రసాద్ కుమార్‌తో మాట్లాడిన రాహుల్ ఢిల్లీకి వచ్చి కలవమని ప్రత్యేకంగా చెప్పారని తెలుస్తోంది.స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను రాహుల్ గాంధీ ఎందుకు ఢిల్లీకి పిలిచారన్నదానిపై గాంధీభవన్ వర్గాల్లో రకరకాలుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, అందులోనూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ స్వయంగా ఢిల్లీ రమ్మని స్పెషల్‌గా స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను పిలిచారంటే సమ్‌థింగ్ ఈజ్ దేర్ అన్న టాక్ వినిపిస్తోంది. ఏదో బలమైన కారణం లేకుండా రాహుల్ ఎవరినీ ఢిల్లీకి వచ్చి కలవాలని చెప్పరని, అలాంటిది స్పీకర్ పదవిలో ఉన్న ప్రసాద్ కుమార్‌ను హస్తినకు రావాలని పిలిచారంటే కచ్చితంగా ఏదో ఉందని హస్తం పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.ఈ మధ్య స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాలా బిజీగా ఉంటున్నారు. పార్టీ ఫిరాయింపు కేసులను విచారిస్తున్నారాయన. సుప్రీంకోర్టు డైరెక్షన్స్‌తో జంపింగ్ ఎమ్మెల్యేల విచారణను స్పీడప్ చేసిన స్పీకర్ ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. ఇక కడియం శ్రీహరి విచారణ పూర్తి కాగా తీర్పును రిజర్వ్ చేశారు. మరోవైపు ఇంకా దానం నాగేందర్ కేసు తుది విచారణను బాకీ ఉంది. ఇలా పార్టీ ఫిరాయింపుల కేసు విచారణతో స్పీకర్ ప్రసాద్ కుమార్ బాగా విసిగిపోయారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ స్పీకర్ తీరుపై విమర్శలు గుప్పిస్తోంది. ఇక మరో ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎలాంటి తీర్పు ఇస్తారన్నదానిపై రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ వ్యవహారమంతా స్పీకర్ ప్రసాద్‌కు హెడెక్‌గా మారిందట. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ కూడా ప్రసాద్ కుమార్‌కు తలకు మించిన భారంగా మారిందన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి సిచ్యువేషన్‌లో రాహుల్ గాంధీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను ఢిల్లీకి పిలవడం వెనుక రీజనేంటన్నదానిపై ఉత్కంఠ నెలకొందిపార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్స్‌పై విచారణ క్లైమాక్స్‌కు చేరుకున్న నేపథ్యంలో ఆ అంశంపై చర్చించేందుకు పిలిచి ఉంటారా అన్నదానిపై గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక మంత్రివర్గంలో ఇంకా రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. అమాత్య పదవుల కోసం చాలా మంది ఆశలు పెట్టుకోగా.. అందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రేసులో ఉన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారటమంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు ప్రసాద్ కుమార్ హైకమాండ్ కు లేఖ రాశారు. కానీ అప్పుడు క్యాబినెట్‌లో ఆయనకు చోటు దక్కలేదు. అయితే మంత్రిపదవిపై ప్రసాద్ కుమార్ ఇంకా ఆశలు పెట్టుకున్నారట. ఇలాంటి ఈక్వేషన్స్ నేపథ్యంలో ఢిల్లీకి వచ్చి కలవమని రాహుల్ గాంధీ చెప్పడంతో గడ్డం ప్రసాద్‌లో మళ్లీ ఆశలు చిగురించాయని అంటున్నారు. మరి స్పీకర్‌ను రాహుల్ ఢిల్లీకి పిలిచింది మంత్రివర్గంలో బెర్త్ కోసమా? లేక ఫిరాయింపు అంశంపై చర్చించేందుకా? అన్నదే ఇప్పుడు కాంగ్రెస్ వర్గాలతో పాటు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఉత్కంఠ రేపుతోంది.అయితే ఒకవేళ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై డిస్కస్ చేస్తే..రాహుల్‌తో భేటీ తర్వాత స్పీకర్ నిర్ణయం ఎలా ఉండబోతోంది? మంత్రి వర్గంలో చోటు కోసమైతే గడ్డం ప్రసాద్ ప్లేస్‌లో స్పీకర్ అయ్యేదెవరనేది కూడా చర్చనీయాంశంగా మారింది. ప్రసాద్‌కుమార్‌ను క్యాబినెట్‌లోకి తీసుకుంటే..ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్న ముగ్గురు ఎస్సీ ఎమ్మెల్యేల్లో ఒకరికి స్పీకర్ పదవి కట్టబెట్టే అవకాశం ఉందంటున్నారు. రాహుల్‌తో స్పీకర్ భేటీ తర్వాత ఏం జరగబోతోందో చూడాలి.

====================

# గామాలపాడు లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

పల్నాడు మార్చి 8,

దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డ్రగ్స్ పై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, పదిమంది ఎస్సైలు మరియు పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామంలో అనుమానాస్పద ప్రాంతాలను తనిఖీ చేస్తూ ఇళ్లను, వాహనాలను పరిశీలించారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు లేని సుమారు 40 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పలుగులు, గొడ్డళ్లు వంటి ప్రమాదకర ఆయుధాలను కూడా పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై పోలీసులు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, సమాజానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని వివరించారు. మాదక ద్రవ్యాల నివారణ కోసం గ్రామస్తులు సహకరించాలని పోలీసులు కోరగా, గ్రామస్థులు డ్రగ్స్కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటం కోసం ఇలాంటి చర్యలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. పోలీసుల అవగాహన కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో దాచేపల్లి సిఐ భాస్కర్, ఎస్సైలు గామలపాడు గ్రామ పెద్దలు శంకర శెట్టి సుబ్బారావు సుంకర శ్రీనివాసరావు సాంబ తదితరులు పాల్గొన్నారు

# రాజశేఖర్ రెడ్డి తర్వాత రేవంతే...



హైదరాబాద్, మార్చి 8

తెలంగాణ నేతలకు హైకమాండ్ గా సీఎం రేవంత్ రెడ్డి మారారు. వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపడం ద్వారా రేవంత్ రెడ్డి హైకమాండ్ వద్ద తన పట్టు నిరూపించుకున్నారు. తనపై అసంతృప్తి గళం వినిపిస్తున్న వారికి గట్టిసందేశం పంపారు. తెలంగాణ కాంగ్రెస్ కు సంబంధించినంత వరకూ అంతా తన కనుసన్నల్లోనే ఉంటుందని ఎవరైనా తోక జాడిస్తే రాజకీయ భవిష్యత్ ఉండదన్నంత పట్టు సాధించినట్లుగా చెప్పకనే చెప్పారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వాళ్లు.. తెర వెనుక ఏమైనా చేయాలనుకున్నా సైలెంటుగా గా ఉండటం .. కుదిరితే రేవంత్ భజన ప్రారంభించడం మినహా మరో దారి లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. రేవంత్ చాలా స్వల్ప కాలంలోనే పార్టీని గుప్పిట్లోకి తెచ్చుకున్నారని అందరూ అంచనాకు వస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఒకప్పుడు గ్రూపు రాజకీయాలు, సీనియర్ల అసమ్మతి గళాలు సర్వసాధారణం. కానీ, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వల్ప కాలంలోనే రేవంత్ రెడ్డి పార్టీని తన గుప్పిట్లోకి తెచ్చుకోవడంలో సఫలమయ్యారు. కీలక పదవులన్నీ తన కనుసన్నల్లోనే భర్తీ అయ్యేలా చూసుకుంటున్నారు. ఢిల్లీలోని అధిష్టానం వద్ద తన మాటే శాసనమని ఆయన నిరూపించుకున్నారు. రేవంత్ రెడ్డి కేవలం పాలనకే పరిమితం కాకుండా, పార్టీ అంతర్గత వ్యవహారాలపై పూర్తి స్థాయి పట్టు సాధించారు. ఒకప్పుడు రేవంత్ నాయకత్వాన్ని వ్యతిరేకించిన సీనియర్లు సైతం ఇప్పుడు ఆయన కనుసన్నల్లో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎవరైనా వ్యతిరేక గళం వినిపిస్తే వారి రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్న హెచ్చరికను రేవంత్ తన వ్యూహాల ద్వారా స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ పార్టీలో నేనే హైకమాండ్ అనే స్థాయికి ఆయన ఎదిగారు, ఇది గత దశాబ్ద కాలంలో ఏ కాంగ్రెస్ ముఖ్యమంత్రికీ సాధ్యపడలేదు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి ఫైర్ బ్రాండ్ నేతలు కూడా ప్రస్తుతం రేవంత్ రెడ్డి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గతంలో విభేదాలు ఉన్నప్పటికీ, రేవంత్ సాధించిన రాజకీయ విజయం చూశాక, ప్రస్తుతానికి ఆయనతో కలిసి వెళ్లడమే శ్రేయస్కరమని వారు భావిస్తున్నారు. తెర వెనుక ఎన్ని ప్రయత్నాలు చేసినా, రేవంత్ వ్యూహాల ముందు అవి ఫలించడం లేదని అర్థం చేసుకున్న నేతలు.. ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండటం లేదా రేవంత్ భజన వైపు మళ్లడం మినహా మరో దారి లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. రేవంత్ రెడ్డి బలం కేవలం రాష్ట్రానికే పరిమితం కాలేదు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేల వద్ద ఆయన సంపాదించుకున్న నమ్మకం అసాధారణం. రాష్ట్రం నుండి ఏ నిర్ణయం వెళ్లినా దానికి ఢిల్లీ ఆమోదముద్ర వేస్తుండటంతో, స్థానిక సీనియర్లు హైకమాండ్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసే అవకాశాలు మూసుకుపోయాయి. వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ సీటు దక్కడం అనేది రేవంత్ రెడ్డి ఢిల్లీ లాబీయింగ్‌లో సాధించిన అతిపెద్ద విజయంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. సాధారణ కార్యకర్తల్లో రేవంత్ రెడ్డి పట్ల ఉన్న ఆదరణే ఆయనకు కొండంత అండగా నిలుస్తోంది. దూకుడుగా నిర్ణయాలు తీసుకోవడం, ప్రత్యర్థులను రాజకీయంగా దెబ్బతీయడంలో ఆయన చూపిస్తున్న చొరవ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. పార్టీని ఒక కార్పొరేట్ తరహాలో క్రమశిక్షణతో నడిపిస్తూనే, తనను వ్యతిరేకించే శక్తులను ఒక్కొక్కటిగా ప్రక్కకు తప్పుకోవాల్సిన పరిస్థితిని కల్పించారు. మొత్తానికి తెలంగాణ కాంగ్రెస్‌లో రేవంత్ శకం మొదలైందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

# మహబూబాబాద్ జిల్లాలో గిరిజనుల జాతర

వరంగల్, మార్చి 8

మహబూబాబాద్ జిల్లాలో గిరిజనుల జాతర మొదలయింది. నిండు పున్నమి కాంతుల్లో అడవి తల్లి పులకిస్తోంది. డోలు వాయిద్యాల మోత, శివసత్తుల పూనకాల మధ్య మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడ గ్రామంలో వెలిసిన 'కొమ్మాలమ్మ' జాతర భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. మేడారం సమ్మక్క-సారలమ్మల తరహాలోనే గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఈ వనదేవతకు 11వ శతాబ్దం నాటి ఘనమైన చరిత్ర ఉంది. సాధారణంగా దైవం అంటే విగ్రహ రూపంలో ఉంటారు. కానీ, కొమ్మాలమ్మ తల్లి ఇక్కడ కత్తి రూపంలో దర్శనమివ్వడం ఒక విశిష్టమైన సంప్రదాయం. ఆదివాసీ దేవతలందరిలో కెల్లా పెద్ద దేవతగా కొమ్మాలమ్మను కొలుస్తారు. ఒకప్పుడు గోదావరి తీరంలో వెలిసిన ఈ తల్లి, కాలక్రమేణా 'వాసం' వంశీయుల ఆరాధ్య దైవంగా ఎంచగూడ ప్రాంతానికి చేరుకుంది. ఈ దైవానికి యాలం, ఆలూరి వంశీయులు ప్రధాన పూజారులుగా వ్యవహరిస్తారు. పూర్వం ఈ ఖడ్గాన్ని తిరిగి గోదావరి ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేయగా, అరిష్టాలు సంభవించడంతో భక్తులు భయపడి తిరిగి ఎంచగూడలోనే ప్రతిష్టించారని చరిత్ర చెబుతోంది. కొమ్మాలమ్మ కేవలం దేవత మాత్రమే కాదు, ఆదివాసీల పాలిట ఒక ప్రకృతి శాస్త్రవేత్తగా విరాజిల్లుతోంది. రాబోయే ఏడాది వర్షాలు ఎలా ఉంటాయో తల్లి ముందే హెచ్చరిస్తుందని భక్తుల నమ్మకం. గద్దెపై ఉన్న ఖడ్గానికి తగిలించిన వెండి కంకణాలు కదిలి గలగలమంటూ శబ్దం చేస్తే ఆ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, ఒకవేళ కంకణాలు బిగుసుకుపోయి నిశ్శబ్దంగా ఉంటే వర్షాలు తక్కువని గిరిజనులు భావిస్తారు. వర్షాలు లేని సమయంలో ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేస్తే కచ్చితంగా వానలు కురుస్తాయని వారి ప్రగాఢ విశ్వాసం. అందుకే అత్యంత భక్తి విశ్వాసాలతో దీనిని జరవుకుంటారు. సమ్మక్క సారలమ్మలకు బెల్లాన్నిసమర్పించినట్లుగా, కొమ్మాలమ్మ తల్లికి వెండి కంకణాన్ని కానుకగా సమర్పించడం ఇక్కడి ప్రధాన ఆచారం. ముఖ్యంగా సంతానం లేని వారు తల్లిని వేడుకుంటే ఫలితం నిశ్చయమని భక్తుల నమ్మకం. కోరిక తీరిన దంపతులు తమ కృతజ్ఞతగా తల్లికి వెండి కంకణాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి కోనాపురం అడవుల నుండి సేకరించిన ప్రత్యేక వెదురు కంకలు, ఎర్రని జెండాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సమ్మక్క బండారి వంశానికి చెందిన వారు కాగా, కొమ్మాలమ్మ కూడా అదే బండారి వంశీయుల మహాశక్తిగా పూజలందుకోవడం విశేషం. అగ్ని రూపంలో గద్దెపైకి చేరే వనదేవత, అడవి బిడ్డల కష్టాలను తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతోంది.

# 14-15 ఏండ్లలోపు బాలికలు హెచ్ పీ వీ వ్యాక్సిన్ వేయించాలి:జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 8 (భారత శక్తి): జిల్లాలోని 14 నుంచి 15 ఏండ్ల వయసులోపు బాలికలకు హెచ్ పీ వీ (హ్యూమన్ పాపి లోమా వైరస్) వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు ఏప్రిల్1 తేదీ 2011-మార్చి31 తేదీ 2012 మధ్య పుట్టిన పలువురికి వ్యాక్సిన్ లు వేశారు. అనంతరం వారికి వాక్సినేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలకు ఆడపిల్లల తల్లిదండ్రులు బాధ్యత వహించి హెచ్ పీ వీ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని పిలుపు ఇచ్చారు. జిల్లాలో 3, 773 మంది బాలికలను గుర్తించారని, బాలికల తల్లిదండ్రులు గుర్తింపు కార్డుతో వచ్చి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య



కేంద్రంలో వ్యాక్సిన్ పంపిణీ మొదలు పెట్టామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి లో నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, డీఎం హెచ్ ఓ రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, మార్చి 08:

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన హాజరుకాగా, గౌరవ అతిథులుగా 'సేవ్' ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు విజయ్ రామ్, ప్రముఖ పోషకాహార నిపుణులు, మనస్తత్వవేత్త డాక్టర్ నిదా ఫాతిమా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, వివిధ విభాగాల డీసీపీలు, పోలీస్ అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్, జీహెచ్ఎంసీ అధికారులు, రైతులు మరియు వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. 'గివ్ టూ గైన్' థీమ్ తో ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. మహిళా శక్తిని గౌరవించడం, సమాజంలో వారి పాత్రను గుర్తించడం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. సమాజంలో సానుకూల మార్పులకు మహిళా సాధికారత ఎంతో కీలకమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

లక్ష్యసాధనకు క్రమశిక్షణే మార్గం.. సీఎంసీ కమీషనర్ సృజన



ఏ రంగంలోనైనా రాణించాలంటే క్రమశిక్షణ, స్పష్టమైన లక్ష్యం మరియు నిరంతర కృషి అవసరమని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీమతి సృజన అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే సమాజానికి సేవ చేయాలనే తపన తనలో ఉండేదని, తన తండ్రి బాలరామయ్య గారి స్ఫూర్తితోనే సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి పొలిటికల్ సైన్స్ లో మాస్టర్స్ పూర్తి చేసిన తాను, క్రమబద్ధమైన ప్రణాళికతో చదివి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో దేశవ్యాప్తంగా 44వ ర్యాంక్ సాధించినట్లు వివరించారు. యువత తమపై తాము నమ్మకం ఉంచి, కష్టపడి చదివితే ఎలాంటి కఠినమైన లక్ష్యనైనా సులభంగా సాధించవచ్చని ఆమె ఈ సందర్భంగా సూచించారు.

రసాయన రహిత సాగుతోనే ఆరోగ్యం..

రసాయనాలపై ఆధారపడిన వ్యవసాయం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని 'సేవ్' ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు విజయ రామ్ అన్నారు. పాతకాలపు సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారానే భూమిని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని సూచించారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ రూపొందించిన సహజ సిద్ధమైన విధానాలను పాటిస్తే.. రైతులు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ముఖ్యంగా కులాకర్ వంటి సంప్రదాయ బియ్యం రకాల్లో అధిక పోషక విలువలు ఉంటాయని, ఇవి శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రజలందరూ రసాయన రహిత ఆహారాన్ని తీసుకోవాలని, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, సహజ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు, ప్రజలకు హైదరాబాద్‌లో ఏడాది పొడవునా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూలి .. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. మహిళల ఆరోగ్యం, భద్రత, విద్య , ఆర్థిక స్వావలంబన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

శారీరక, మానసిక సమతుల్యతతో సంపూర్ణ ఆరోగ్యం: డాక్టర్ నిదా ఫాతిమా

ప్రముఖ పోషకాహార నిపుణులు, మనస్తత్వవేత్త డాక్టర్ నిదా ఫాతిమా మాట్లాడుతూ, ఆరోగ్యం అంటే కేవలం మనం తీసుకునే పోషకాహారం మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మనం తీసుకునే ఆహారం కేవలం శారీరక శక్తికే కాకుండా, మన ఆలోచనలను మరియు ఒత్తిడిని నియంత్రించే మెదడు పనితీరును కూడా ప్రభావితం చేస్తుందని ఆమె వివరించారు. పోషక విలువలున్న ఆహారమే మానసిక ప్రశాంతతకు పునాది అని, ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించడానికి పోషణ, మనస్తత్వ శాస్త్రం రెండూ సమన్వయంతో ఉండాలని ఆమె పేర్కొన్నారు.

ఫుడ్స్ అండ్ న్యూట్రిషన్‌లో పరిశోధనలు చేసిన డాక్టర్ నిదా, సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను ఎలా అడ్డుకోవచ్చో వివరించారు. ప్రస్తుతం తాను నిర్వహిస్తున్న 'చీఫీస న్యూట్రిషన్ అండ్ బియాండ్' సంస్థ ద్వారా ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎలా అలవర్చుకోవాలో మార్గనిర్దేశం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకియాట్రిస్ట్ కన్సల్టెంట్ హరిణి మాట్లాడుతూ.. పిల్లలు కౌమారదశలో ఉన్నవారి మానసిక ఆరోగ్యం, వారి వికాసం కోసం తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమం ముగింపులో, విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరుస్తున్న మహిళా అధికారులను, సిబ్బందిని మరియు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న మియాపూర్, పటాన్‌చెరు, నిజాంపేట్, మరియు మాదాపూర్ ప్రాంతాల మహిళా పారిశుధ్య కార్మికులను వేదికపై ప్రత్యేకంగా సన్మానించి, వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ వేడుకలో భాగంగా పలువురు నిపుణులు, కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఆసక్తికరంగా మార్చారు. ఏఎస్ఐ కె. వనజ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమం అందరినీ అలరించింది. అలాగే, శ్రీలత, శ్రీకృష్ణల గీతాలాపన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మహిళా సాధికారతకు ప్రతిబింబం ఎక్స్ పో..

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎక్స్ పో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రదర్శనలో మహిళలకు సంబంధించిన రకరకాల దుస్తులు, చేనేత వస్త్రాలు, అలంకరణ వస్తువులు మరియు పోషక విలువలున్న ఆహార పదార్థాల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోలీసుల ఆరోగ్య సంరక్షణ కోసం తృణ ధాన్యాలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం పలు రకాల గృహోపకరణాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన పట్ల పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు మరియు సందర్శకులు విశేష ఆసక్తి కనబర్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సిహెచ్. శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, డబ్ల్యూ అండ్ సీఎస్‌డబ్ల్యూ డీసీపీ సృజన కరణం, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ట్రాఫిక్-× డీసీపీ రంజన్ రతన్ కుమార్, ట్రాఫిక్-×× డీసీపీ ఎస్. శేషాద్రిని రెడ్డి, ఏడీసీపీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బిజెపి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైంది:

## సిపిఎం వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మిడి లక్ష్మినారాయణ

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 8:

దేశవ్యాప్తంగా బిజెపి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని సిపిఎం పార్టీ వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మిడి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో సిపిఎం పార్టీ వాణిజ్య భవన్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రామిక మహిళలను శాలవాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని రోజు రోజుకు మహిళలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ అమలు పరచడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని వాపోయారు. షీ టీం బృందాలు సంఖ్యను పెంచాలని పాఠశాల, కళాశాల బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో ప్రధాన కూడళ్లల్లో మహిళలను, బాలికలను వేధిస్తున్న ఆకతాయిలను గుర్తించి కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోగుల సురేష్, చిత్రం భద్రమ్మ, ధనమ్మ, మంగమ్మ, త్రివేణి, లక్ష్మి, జ్యోతి, పద్మతదితరులు పాల్గొన్నారు.



## ది ఆక్సెంట్ర ఈవెంట్స్ నేతృత్వంలో
# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి8:

ది ఆక్సెంట్ర ఈవెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.స్రవంతి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమాజంలో మహిళల సాధికారత, వారి ప్రతిభను ప్రోత్సహించడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా.జి.సుధారాణి,విమెన్ అండ్ చైల్డ్ రైట్స్ యాక్టివిస్ట్ డా.మమత ఆచంట, ఇండియన్ మాజీ మహిళ క్రికెటర్ సునీత ఆనంద్, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి ఎం. అనూహ్య నాయుడు,కవిత బోధనం -- ఫ్యామిలీ కౌన్సిలర్, తత్వది స్కూల్ ఫౌండర్ పి. అనిత రెడ్డి హాజరై దీపప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మహిళలను ఉద్దేశించి



మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు వస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యం, క్రీడలు,కళలు,వ్యాపారం వంటి అనేక రంగాలలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు తమ సామర్థ్యాన్ని నమ్ముకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే జీవితంలో ఎన్నో విజయాలు సాధించగలరని అన్నారు. కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో కూడా మహిళల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.

మహిళల ఆరోగ్యం,భద్రత,విద్య, ఉపాధి అవకాశాలపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. యువతులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకొని కృషి చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవడం సాధ్యమని పేర్కొన్నారు. మహిళలు పరస్పరం ఒకరికి ఒకరు తోడ్పాటుగా నిలిస్తే సమాజంలో మరింత మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ మహిళల ప్రతిభను వెలికితీయడం, వారికి ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. భవిష్యత్తులో మహిళల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన కొంతమంది మహిళలను సత్కరించి అభినందించారు.కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు,అవగాహన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈవెంట్ మేనేజర్లు కోవిధ,నిఖిల ఇతర మహిళలు,యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డిసిసిబి మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 8 (భారత శక్తి): తలమడుగు మండలం బరంపూర్ గ్రామానికి చెందిన ముడుపు భూమారెడ్డి ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ ఎం. దామోదర్ రెడ్డి గారిని, ఆయన సోదరులు మరియు కుటుంబ సభ్యులను నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి. సత్యనారాయణ గౌడ్ ఆదివారం పరామర్శించారు.

భూమారెడ్డి గారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసి, వారిని ఓదార్చి మనోధైర్యం కల్పించారు.

ఈ కార్యక్రమంలో రత్నాపూర్--కండ్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఇండస్ స్కూల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, మార్చి 8:

సూర్యాపేట జిల్లా కేంద్రం చంద్రన్న కుంటలో గల ఇండస్ స్కూల్లో సోపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా



స్కూల్ విద్యార్థిని విద్యార్థులు జిల్లా కలెక్టర్ గా,విద్యాశాఖ అధికారుగా,పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులుగా, మాత్రమే కాకుండా ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులుగా రాజకీయ నాయకులుగా పలు రకాల బాధ్యతలను ఒక్కరోజు విధులుగా నిర్వహించి అందర్నీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సిహెచ్ కృష్ణ సార్ మాట్లాడుతూ ఒకరోజు నిర్వహించిన ఈ పాత్రలు భవిష్యత్తులో వారి జీవితంలో ఒక కలగానే ఉండిపోకుండా నిజంగా నెరవేర్చుకునేలా ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను అందజేశారు.

## మయస్తీనియా గ్రేవిస్ వ్యాధిగ్రస్తురాలిని దత్తత తీసుకున్న జిడిఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 08(భారత శక్తి) ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామానికి చెందిన మయస్తీనియా గ్రేవిస్ వ్యాధిగ్రస్తురాలిని జిడిఆర్ మెమోరియల్ ట్రస్ట్ దత్తత తీసుకుంది. ఇటీవల ట్రస్ట్ ఆధ్వర్యంలో విట్టోలి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ద్యావరి సత్యగంగ తన ఆరోగ్య సమస్య గురించి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్‌కు వివరించారు.

2001 సంవత్సరం నుంచి ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఆమె తెలిపిన లక్షణాలను పరిశీలించిన అనంతరం ఆమెకు మయస్తీనియా గ్రేవిస్ వ్యాధి ఉందని డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ నిర్ధారించారు. ఈ వ్యాధికి జీవితాంతం మందులు వాడాల్సి ఉంటుందని తెలిపారు. అయితే తనకు భర్త లేకపోవడం, ఇద్దరు పిల్లలను పోషించాల్సిన బాధ్యత ఉండటంతో జీవితాంతం మందులు కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేదని సత్యగంగ ఆవేదన వ్యక్తం చేసింది.

దీనికి స్పందించిన ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ మానవతా దృక్పథంతో సత్యగంగను దత్తత తీసుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవితాంతం ఉచితంగా మందులు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరు నెలలకు సరిపడ మందులను అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ట్రస్ట్ కార్యాలయంలో ఆమెకు మందులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పాటిల్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చొండి రాజేశ్వర్, విట్టోలి గ్రామ పెద్దలు పాపేశ్వర్ పాటిల్, ఆరె మరాఠా సంఘం నాయకుడు కంఠలే రఘువీర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ మయస్తీనియా గ్రేవిస్ నరాలు మరియు కండరాల మధ్య కమ్యూనికేషన్ దెబ్బతినడం వల్ల వచ్చే అరుదైన దీర్ఘకాలిక ఆటో ఇమ్యూన్ వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి ఉన్నవారిలో కనురెప్పలు దిగిపోవడం, ముఖ కవళికలు మారడం, మింగడానికి ఇబ్బంది పడటం, సరిగా మాట్లాడలేకపోవడం, చేతులు-కాళ్ల కండరాలు బలహీనపడటం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. కొన్నిసార్లు శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బందులు తలెత్తవచ్చని తెలిపారు.



ఈ వ్యాధి ప్రాణాంతకమైంది కాకపోయినా బాధితులు బలహీనతకు గురవుతారని, అయితే జీవితాంతం సరైన మందులు వాడితే ఉపశమనం పొందవచ్చని డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ వివరించారు. సత్యగంగకు కూడా జీవితాంతం ఈ వ్యాధికి సంబంధించిన మందులను ట్రస్ట్ ద్వారా అందిస్తామని ఆయన తెలిపారు.

## భైంసా మున్సిపల్ నూతన కమిషనర్‌గా
# వై. నవీన్ కుమార్ బాధ్యతల స్వీకరణ



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 8 (భారత శక్తి): భైంసా మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా వై. నవీన్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం ఆయనను భైంసా మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.

ఆదివారం మున్సిపల్ ఛైర్మన్ తుమ్మొల్ల దత్తాత్రి, కౌన్సిలర్లు నిమ్మల ప్రవీణ్, దిలీప్ తదితరులు కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సమస్యలను పాలకవర్గంతో సమన్వయం చేసుకుంటూ దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కమిషనర్ నవీన్ కుమార్ తెలిపారు.

పట్టణ అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.






## జరగబోయే జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు చార్జ్ ఆఫీసర్ల లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

వై ఎస్ ఆర్ కడప,మార్చి 08(భారత శక్తి):

జిల్లా లో జరగబోయే జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగానిర్వహించేందుకు చార్జ్ ఆఫీసర్ల లకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా అవగాహనను పెంచుకోవాలని సెన్సస్ జిల్లా ఇంచార్జి మోహన్ రమణ తెలిపారు.

ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజీలో జవఅంబం మీఘఋస్త్రవఎవత్ ఖఅస వీశీఅఓశీతీఱఅస్త్ర ూఎర్‌వఎ (జవీమీ) పోర్టల్ వినియోగం పై అధికారులు వివరంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జనగణన ప్రక్రియను డిజిటల్ విధానంలో నిర్వహించడం, ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించడం, సమాచారంసమయానుకూలంగా నమోదు చేయడం వంటి అంశాలపై చార్జ్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. పోర్టల్‌లో లాగిన్ విధానం, డేటా నమోదు,సమాచారం పరిశీలన,ఫీల్డ్ సిబ్బంది పనితీరును మానిటర్ చేసే విధానం వంటి అంశాలపై ప్రాక్టికల్ డెమో ఇవ్వడం జరిగింది.

ఈ శిక్షణ ద్వారా అధికారులు జనగణన కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయగలరని, జిల్లాలో జనగణన కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

శిక్షణ కార్యక్రమంలో జనగణన సమయంలో అడిగే మొత్తం 34 ప్రశ్నలపై కూడా చార్జ్ ఆఫీసర్లకు పూర్తి స్థాయిలో వివరణ ఇచ్చారు.

ప్రతి ప్రశ్న యొక్క ఉద్దేశ్యం, సమాచారాన్ని ఎలా సేకరించాలి, నమోదు చేసే విధానం వంటి అంశాలను అధికారులు వివరించారు. అలాగే ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసి, సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాల్సిన అవసరాన్ని కూడా తెలియజేశారు. ఈ శిక్షణ ద్వారా చార్జ్ ఆఫీసర్లు జనగణన ప్రశ్నలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.

## మహిళలు ఆర్థికంగా సామాజికంగా అన్ని రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలి: జిన్నారం మున్సిపల్ చైర్మన్ నాకీర్తి జనార్ధన్



జిన్నారం మున్సిపల్, భారత శక్తి న్యూస్, మార్చ్ 08:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వం ద్వారా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలనలో కార్యక్రమంలో భాగంగా జిన్నారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్, కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది. ముందుగా మొక్కలు నాటి అనంతరం మహిళ మున్సిపల్ కౌన్సిలర్ లను, మున్సిపల్ మహిళా ఉద్యోగులను, సఫాయి మహిళ కార్మికులను మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్ వీరందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నక్కిర్తి జనార్ధన్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళను గౌరవంగా సన్మానించుకోవడం ఎంతో సంతోషకరమని, మహిళలు సృష్టికి ఆది గురువులని, మహిళలు లేనిదే మనుగడ లేదని సమాజంలో మహిళలు వివిధ రంగాల్లో ప్రావీణ్యం సాధించి అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలి, మహిళల పట్ల సమాజంలో ప్రత్యేక గౌరవం సంచరించుకొని ఉండాలి అన్నారు. నూతన మున్సిపల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాపరెడ్డి ,మహిళ కౌన్సిలర్లు, ఉద్యోగులు, మున్సిపల్ వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా: మంత్రి సీతక్క

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 08: నూతనంగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీనీ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, పనులకు, ప్రజలు సహకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేశామని, పలు అభివృద్ధి పనులకు ఇప్పటికే 15 కోట్ల రూపాయలతో టెండర్లు జరిగాయని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగకల్యాణి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా, 5వ వార్డు కౌన్సిలర్ గుగ్గిళ్ళ దివ్య సుజన్, వార్డుల కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు పెద్దపీఠ: మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 08 (భారత శక్తి ): మహిళా సాధికారతకు పెద్దపీఠ వేస్తూ మహిళల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ అన్నారు.



మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి , వేంనూర్ ఉత్తర తండా గ్రామ పంచాయతీలలో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని,మహిళలు ఆత్మ గౌరవంగా బ్రతకాలనీ మహిళా సంఘాల భవనాలకు ప్రాధాన్యం కల్పించిందని తెలియజేసారు.స్వయం సహాయక సంఘాల ద్వారా కోటీ మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.మహబూబాబాద్ మండలంలో మొత్తం 30 నూతనంగా స్వయం సహాయక సంఘ ఫెడరేషన్ భవనాలు నిర్మిస్తున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో,ఎంపీడీవో, ఏపీఎం , గ్రామ సర్పంచ్, మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధి లోని పెద్ద చెరువు వద్ద శానిటేషన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 08: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కామారెడ్డి జిల్లా లోని పెద్ద చెరువు వద్ద శానిటేషన్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.

రోజుకో వీధిలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాలని సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో మొదటి థీమ్ అయిన పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ కార్యక్రమంలో భాగంగా రెండవరోజు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మార్చి, 6 నుండి 15 వరకు నిర్వహించే పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అన్ని వీధులు, వార్డులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు పరిశుభ్రం చేసే కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ 99 రోజుల కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరు తమ ఇల్లు, తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా కృషి చేయాలని తద్వారా రాబోయే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చున్నారు.

ఈ పది రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తమ పరిసరాలను, కార్యాలయాల లోపల పరిశుభ్రంగా చేసుకోవాలని, అంతేకాకుండా కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న ఫైళ్లు యుద్ధప్రాతిపదికన పరిష్కరించి అట్టి సమాచారాన్ని సంబంధిత లబ్ధిదారులకు తెలియపరచే విధంగా అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో వార్డు మెంబర్లు, కౌన్సిలర్ లు పాల్గొనేలా చూడాలని పట్టణ పరిశుభ్రతకు పాటుపడాలని కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీఓ వీణ, తహసిల్దార్ హిమబిందు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు , కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 08: శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల చిన్న మల్లారెడ్డి మండలం కామారెడ్డిని సందర్శించడం జరిగింది. మొదట మధ్యాహ్న భోజనము తయారు చేసే వంటగదిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ, వారు ఎలాంటి టెన్షన్ లేకుండా భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని మంచిగా చదవాలని వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని ప్రోత్సహించారు. అలాగే పాఠశాలలో గల కంప్యూటర్ లాబ్ ను పరిశీలించి ఎనిమిదో తరగతి విద్యార్థులు కంప్యూటర్లో తయారుచేసిన పోస్టర్ ను పరిశీలించారు. పాఠశాల పరిశుభ్రతను పరిశీలించి ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. అవసరమైన సౌకర్యాలను త్వరలో కల్పిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎలాంటి టెన్షన్ లేదా భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లాను ఉతీర్ణత లో టాప్ గా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నలినీ దేవి, ఎంఈఓ ఎల్లయ్య , గ్రామ సర్పంచ్ కార్యవర్గము, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమాన్లు, ఎమ్ పి డిఓ, గ్రామ కార్యదర్శి, గ్రామ పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు , గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన విద్యార్థిని సన్మానించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 08: జిల్లా కలెక్టర్ ఛాంబర్లో బాన్సువాడ గ్రామానికి చెందిన విద్యార్థి శశిధర్ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సన్మానించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో ప్రతిభ కనబరుస్తున్న శశిధర్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ చాటుకున్నాడన్నారు.

ఇప్పటివరకు శశిధర్ 15 సార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో, 7 సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఇటీవల 14.02.2026 నుండి 19.02.2026 వరకు ఇండోనేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్లో ఇండియా జట్టు తరుపున పాల్గొని బంగారు పతకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడనీ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశిధర్ను అభినందిస్తూ భవిష్యత్తులో ప్రపంచ స్థాయిలో కూడా రాణించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లోయపల్లి చిన్న నర్సింగ్ రావు, కార్యదర్శి కృష్ణమూర్తి, నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కోశాధికారి రాజేశ్వర్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, శశిధర్ తండ్రి శివ రాజులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 08: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా భిక్కనూర్ లక్ష్మీ, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు , వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించి, లబ్ధిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ , జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో కూలిపోయిన ఇళ్లను చూసి చలించిపోయి అధికారంలోకి రాగానే ఇళ్లను నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయించడం ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మండల్ లీగల్ సర్వీస్ కమిటీ - శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మెదక్ , భారత శక్తి,మార్చ్ 08:జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల ప్రకారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్, ఐసిడిఎస్ నర్సాపూర్ ఆధ్వర్యంలో సమిష్టిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది,

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయమూర్తి ఎం. హేమలత, జూనియర్ సివిల్ జడ్జ్, చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్, హాజరై అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, అమ్మ ఆది గురువు అని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళా సాధికారత తో సమాజ మార్పుకు కంకణ బదులు కావాలి అన్నారు, మహిళలు అన్ని రంగాలలో వారి ప్రాధాన్యతను కనపరిచి, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి స్ఫూర్తినివ్వాలి అన్నారు,

నేటి సమాజంలో మహిళలు జీవనస్థితిగతులు మెరుగుపరుచుకుంటూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరు చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలి అన్నారు,

ఏవైనా మహిళలకు అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే న్యాయ సహాయం కోసం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ను ఆశ్రయించవచ్చు అన్నారు, లీగల్ సర్వీస్ ద్వారా చట్టపరంగా జరిపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు,

కార్యక్రమంలో విశిష్ట అతిథిగా విచ్చేసిన మెదక్ జిల్లా శిశు సంక్షేమ శాఖ డి.డబ్ల్యు.ఓ.హేమ భార్గవి ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలందరికీ మరోసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మహిళలు చట్టాల పైన సమాజం పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి అన్నారు, సమాజంలో మహిళలకు కానీ గ్రామీణ ప్రాంత ప్రజలకు గాని చట్టపరమైనటువంటి సమస్యలు తలెత్తినప్పుడు కానీ, ఇతరత్ల సమస్యలు తలెత్తినప్పుడు కానీ సమస్యలు పరిష్కరించుకోవడం కోసం గొప్ప మనోధైర్యంతో ముందడుగు వేయాలి అన్నారు,

డి.శ్రీధర్ రెడ్డి ప్రభుత్వ సహాయ న్యాయవాది, సి.హెచ్. స్వరూప రాణి లీగల్ సర్వీస్ న్యాయవాది లు మాట్లాడుతూ ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలపడం జరిగింది, మహిళలు స్వశక్తితో అన్ని రంగాల్లో రాణించి సమాజానికి స్ఫూర్తినివ్వాలి అన్నారు, మహిళలు లేనిదే సమాజం లేదని,ఉన్నారు,

ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో ఎన్జీవో కో డైరెక్టర్ సునీత, ఐసిడిఎస్ సూపర్వైజర్ సరళ కుమారి, మెహతా బేగం,జి.సంతోష,ఎన్. సుజాత, ఏ.సంతోష, సుల్తానా బేగం, వివిధ



గ్రామాల అంగన్వాడీ టీచర్స్, లీగల్ సర్వీస్ సిబ్బంది టి. ఆంజనేయులు, టి.అరుణ, వై.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా నేతృత్వంలోని అభివృద్ధికి పటిష్ట పునాది

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మార్చి 08:



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనం కేవలం మహిళల విజయాలనే కాకుండా, భారతీయ నారీ శక్తి యొక్క అలుపెరుగని పట్టుదలను గౌరవించుకుంటున్నాం. భారతదేశ చరిత్రను గమనిస్తే.. మహిళలు కేవలం చట్టసభల్లో, బోర్డు రూమ్లలోనే కాదు, ఇళ్లు, పొలాలు మరియు తరగతి గదుల్లోనూ సమాజానికి నిశ్శబ్ద మూలస్తంభాలుగా నిలిచారు. నేడు భారతీయ మహిళలు దేశ పరివర్తనలో ముందు వరుసలో ఉండి.. విద్య, స్టెమ్ (రుజువీ), రక్షణ మరియు పాలన వంటి రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారు. ఫైటర్ పైలట్ల నుండి క్షేత్రస్థాయి నాయకుల వరకు, వారు దేశ పురోగతిని నడిపిస్తున్నారు.

ఈ శక్తికి బలమైన చారిత్రక నేపథ్యం ఉంది. సావిత్రిబాయి ఫూలే చూపిన విద్యా మార్గం నుండి అహల్యాబాయి హోల్కర్ అందించిన కరుణతో కూడిన పాలన వరకు మన నాగరికత ఎప్పుడూ 'శక్తి'ని పూజిస్తూనే ఉంది. ప్రతి మహిళలో పోషించే మరియు నడిపించే బలం ఉందని మన సంస్కృతి నమ్ముతుంది. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, మహిళలను కేవలం పథకాల 'లబ్ధిదారులు'గా చూసే స్థాయి నుండి, వారిని దేశ అభివృద్ధిని నడిపించే 'నాయకులు'గా గుర్తించే స్థాయికి భారత్ చేరుకుంది. నేడు 'మహిళా నేతృత్వంలోని అభివృద్ధి' అనేది కేవలం ఒక ఆకాంక్ష మాత్రమే కాదు, అది మన ప్రభుత్వ విధానాల్లో మరియు జాతీయ ప్రాధాన్యతల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

ప్రతి కనిపిస్తున్న విజయం వెనుక ఒక నిశ్శబ్ద శక్తి ఉంటుంది, అదే 'కేర్ ఎకానమీ' (సంరక్షణ ఆర్థిక వ్యవస్థ). కుటుంబం కోసం తెల్లవారుజామునే నిద్రలేచి, అందరినీ సంరక్షించి తన పనిలోకి వెళ్లే తల్లి.. ఎన్ని కష్టాలు ఎదురైనా కుటుంబాన్ని కలిపి ఉంచే భార్య.. పగలంతా ఆఫీసులో పనిచేసి రాత్రిపూట వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూసే కూతురు---వీరి శ్రమకు వెలకట్టలేము. ఇప్పటివరకు ఈ శ్రమను ఎవరూ కొలవలేదు, కానీ ఇది మన ఇళ్లను, సమాజాన్ని మరియు దేశాన్ని నిశ్శబ్దంగా నిలబెడుతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం, మహిళల ఈ అదృశ్య శ్రమను గౌరవించేందుకు మరియు దానిని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉంది.

భారత మహిళా కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (ఖీూఖీూ=) 2017-18లో 23.3% ఉండగా, అది 2023-24 నాటికి 41.7% కి చేరుకోవడం మహిళల ఆర్థిక ఎదుగుదలకు నిదర్శనం. ఆర్థిక సర్వేలో పేర్కొన్నట్లుగా, సంరక్షణ సేవలు (ఝుతీవ ూవతీఙఱషవం) బలంగా ఉంటే మహిళలకు మరిన్ని లక్షలాది అవకాశాలు లభిస్తాయి. ఈ దార్శనికతకు అనుగుణంగానే కేంద్ర బడ్జెట్ 2026-27లో చారిత్రక కేటాయింపులు జరిగాయి. జెండర్ బడ్జెట్ తొలిసారిగా ?5 లక్షల కోట్ల మార్కును దాటింది. ప్రభుత్వంలోని అన్ని విభాగాల సమన్వయంతో 1.5 లక్షల మంది సంరక్షకులకు (ఝుతీవస్త్రఱజవతీం) నైపుణ్య శిక్షణ ఇవ్వడం, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను విస్తరించడం, అంగన్వాడీ కేంద్రాలను ఆధునీకరించడం వంటి పనులు వేగంగా జరుగుతున్నాయి. మహిళలకు అండగా ఉంటే ఆర్థిక వ్యవస్థలు వేగంగా అభివృద్ధి చెందుతాయని భారత్ నమ్ముతోంది.

సామాజిక భద్రత మరియు పని ప్రదేశాల్లో భద్రత వంటి చట్టపరమైన సంస్కరణలు నేడు శిశు సంరక్షణ కేంద్రాల (జతీఎష్ట్రవం) ఏర్పాటును తప్పనిసరి చేస్తున్నాయి. దేశ జనాభాలో మహిళలు మరియు పిల్లలు 65 శాతానికి పైగా ఉన్నందున, నాణ్యమైన శిశు సంరక్షణలో పెట్టుబడి పెట్టడం అంటే దేశ భవిష్యత్తు కోసం బలమైన పునాది వేయడమే. మారుతున్న కాలంలో ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు పెరుగుతున్న వేళ, ఇలాంటి సంస్థాగత మద్దతు మహిళల ఆశయాలకు రెక్కలు తొడుగుతుంది.

భారతదేశం 2047 నాటికి 'వికసిత భారత్'గా ఎదగాలంటే, బలమైన సామాజిక పునాదులు ఉండాలి. ఆ పునాదులలో కేర్ ఎకానమీ అత్యంత కీలకమైనది. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేళ, మహిళల అదృశ్య శ్రమకు గుర్తింపునిస్తూ, వారికి తగిన గౌరవం మరియు సంస్థాగత మద్దతు అందించేందుకు మేము మళ్ళీ ప్రతిజ్ఞ చేస్తున్నాం. మా దృష్టిలో మహిళా నేతృత్వంలోని వికసిత భారత్ అంటే.. ప్రతి మహిళకు తన పూర్తి సామర్థ్యాన్ని నాయకురాలిగా చాటుకునే అవకాశం మరియు గౌరవం లభించే దేశం.

(రచయిత: శ్రీమతి అన్నపూర్ణా దేవి, కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి)

# శాంతి భద్రతల్లోనే కాదు..
# క్రీడల్లోనూ మగువలే మేటి!

సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, మార్చి 08:

విధి నిర్వహణలో కఠినంగా ఉంటూనే, మరోవైపు క్రీడా మైదానంలో పతకాల పంట పండిస్తున్నారు సైబరాబాద్ మహిళా పోలీసులు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూనే, యోగా, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ వంటి విభాగాల్లో జాతీయ స్థాయి ప్రతిభను కనబరుస్తూ తోటి సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి విజయగాథలపై ప్రత్యేక కథనం.



బహుముఖ ప్రజ్ఞాశాలి: జి. రాజమణి, డబ్ల్యూపీసీ

రాజమణి కేవలం పోలీస్ విధులకు మాత్రమే పరిమితం కాకుండా, వివిధ క్రీడల్లో తనదైన ముద్ర వేశారు.

స్విమ్మింగ్: 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు.యోగా: ట్రెడిషనల్ యోగాసన (18-28 ఏళ్ల విభాగం)లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు.

అథ్లెటిక్స్: 5000 మీటర్లు, 10000 మీటర్ల ట్రాక్ ఈవెంట్లలో రెండు వెండి పతకాలు సాధించి తన వేగాన్ని నిరూపించుకున్నారు.బ్యాడ్ మిన్ టన్ లో సత్తా: ఎన్. రోహిణి, ఆర్ఎస్ఐఆర్.ఎస్.ఐ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రోహిణి, బ్యాడ్ మిన్ టన్ క్రీడల్లో తిరుగులేని ప్రతిభను చాటుతున్నారు.

బ్యాడ్మింటన్: ఎన్.జి.ఓ ఓపెన్ విభాగంలో బంగారు పతకం సాధించారు.టేబుల్ టెన్నిస్: ఓపెన్ డబుల్స్ విభాగంలో వెండి పతకాన్ని, టీమ్ ఈవెంట్లో కాంస్య పతకాన్ని గెలుపొందారు.యోగాసనాల్లో రాణిస్తున్న సరిత, డబ్ల్యూపీసీ

మహిళా కానిస్టేబుల్ సరిత యోగా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. ట్రెడిషనల్ యోగాసనాలు, ఆర్టిస్టిక్ యోగాసనాల విభాగాల్లో పట్టు సాధించి రెండు కాంస్య పతకాలను తన ఖాతాలో వేసుకున్నారు.టేబుల్ టెన్నిస్ స్టార్: సత్యమ్మ, డబ్ల్యూపీసీ సత్యమ్మ అటు యోగాలో, ఇటు టేబుల్ టెన్నిస్ లో రాణిస్తున్నారు.టేబుల్ టెన్నిస్: ఓపెన్ డబుల్స్ లో వెండి పతకం, ఓపెన్ సింగిల్స్ లో కాంస్య పతకం సాధించారు.యోగా: ఆర్టిస్టిక్ యోగాసన సింగిల్ విభాగంలో వెండి పతకాన్ని గెలుచుకున్నారు.

వృత్తిపరమైన ఒత్తిడిని అధిగమిస్తూ, క్రీడల్లో రాణిస్తున్న ఈ మహిళా పోలీసులు సమాజానికి, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలుస్తున్నారు.బంగారు పథకాలు..

ఖో-ఖో విభాగంలో ఈ. శ్వేత, జి. గంగ, ఎస్. శిరీష, పి. శ్వేత, బి. అనిత, జి. రాజమణి, ఎన్. వనజ, యు. వసంత, ఏ. గాయత్రి, ఈ. రేణుక, కె. దివ్య, బి. గాయత్రి, మహేశ్వరి, జి. స్వాతి మరియు పి. స్వర్ణలత తమ జట్టుతో కలిసి స్వర్ణ పతకాన్ని సాధించారు. అలాగే బ్యాడ్మింటన్ విభాగంలో ఎన్. రోహిణి, తేజశ్రీలు బంగారు పతకాలు గెలుచుకోగా.. అథ్లెటిక్స్ ట్రాక్ ఈవెంట్స్‌లో బి. అనిత, గాయత్రి, యోగా, స్విమ్మింగ్ విభాగాల్లో జి. రాజమణి గోల్డ్ మెడల్స్ సాధించి సత్తా చాటారు.

రజత పథకాలు..టేబుల్ టెన్నిస్ విభాగంలో ఎన్. రోహిణి మరియు సత్యమ్మ రజత పతకాలు సాధించారు. అథ్లెటిక్స్ ట్రాక్ ఈవెంట్స్‌లో జి. రాజమణి, బి. అనిత తమ ప్రతిభను కనబర్చి సిల్వర్ మెడల్స్ గెలుచుకోగా.. ఆర్మ్ రెస్లింగ్‌లో డి. శ్రీదేవి, యోగాలో వనజ, సత్యమ్మలు వెండి పతకాలను సొంతం చేసుకున్నారు.

కాంస్య పథకాలు

కబడ్డీ పోటీల్లో డి. మంజుల, టి. ప్రత్యూష, ఎం. మమత, పి. స్వర్ణలత, సాయి ప్రసన్న, వాణిశ్రీ, బి. గంగ, జి. స్వాతి, ఈ. రేణుక, కె. రాధిక, ఎస్. శిరీష మరియు రాధికల బృందం కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. టగ్ ఆఫ్ వార్ (తాడు లాగుట) విభాగంలో సిహెచ్. సంధ్యారాణి, పి. సౌందర్య, ఎం. రజిత, పి. మీన, ఎస్. శిరీష, కె. కవిత, ఎం. రేణుక, డి. శ్రీదేవి, వి. సునీత, బి. గంగలు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీటితో పాటు టేబుల్ టెన్నిస్, యోగాలో రోహిణి, ఈ. సునీత, సత్యమ్మ, సువర్ణలు మరిన్ని పతకాలను సాధించారు. అథ్లెటిక్స్ ఫీల్డ్ ఈవెంట్స్ లో పి. శ్వేత, ఎ. గాయత్రిలు కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

# విధి నిర్వహణలో సైబరాబాద్ మహిళా పోలీసుల ప్రతిభ

సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, మార్చి 08:

సైబరాబాద్ మహిళా పోలీసులు వీధి నిర్వహణలో తమ ప్రతిభ, అంకితభావంతో గుర్తింపు పొందుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలోనే కాకుండా, అధికారిక కార్యక్రమాల్లోనూ తమదైన ముద్ర వేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

క్రమశిక్షణకు నిదర్శనం..అక్టోబర్ 21న నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా, మహిళా పోలీస్ అధికారులు క్రమశిక్షణతో కూడిన పరేడ్‌లో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కవాతులో వారు ప్రదర్శించిన ఏకాగ్రత, సమన్వయం, వృత్తిపరమైన అంకితభావం పరేడ్‌కు మరింత గౌరవాన్ని చేకూర్చింది. నగరానికి విచ్చేసే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులకు ఇచ్చే 'గార్డ్ ఆఫ్ హానర్', వారి సమయపాలన మరియు బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అద్దం పడుతోంది.

అప్రమత్తమైన భద్రత..కేవలం పగటి విధులతోనే పరిమితం కాకుండా, మహిళా పోలీసులు రాత్రి సమయాల్లోనూ అత్యంత అప్రమత్తతతో సెంట్రీ విధులను నిర్వర్తిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని కీలక ప్రాంతాలు, కార్యాలయాల వద్ద నిరంతరం కాపలా కాస్తూ నగర భద్రతా వ్యవస్థలో తమవంతు కీలక పాత్ర పోషిస్తున్నారు.

సృజనాత్మకతలోనూ..

వృత్తిపరమైన బాధ్యతలతో పాటు, హోం గార్డ్స్ వార్షికోత్సవం వంటి అధికారిక కార్యక్రమాల్లో మహిళా పోలీసులు వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తూ తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నారు. సభలను సమర్థవంతంగా నడిపిస్తూ, తమ వాగ్ధాటితో కార్యక్రమ నిర్వహణను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.



సీపీ ప్రత్యేక అభినందనలు

ప్రతిష్టాత్మక 'మిస్ వరల్డ్' పోటీల బందోబస్తు విధుల్లో మహిళా పోలీసులు ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరును పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా కొనియాడారు. క్లిష్టమైన పరిస్థితుల్లో వారు చూపిన అంకితభావాన్ని గుర్తిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉన్నతాధికారుల నుంచి అందుతున్న ఈ గుర్తింపు, ఇతర మహిళా సిబ్బందికి స్ఫూర్తినిస్తోంది.

సీపీఆర్‌తో ప్రాణ రక్షణ

విధి నిర్వహణలో మహిళా పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, ప్రాణదాతలుగానూ నిలుస్తున్నారు. పరిగి నుంచి విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ముగ్గురు ఏఆర్ మహిళా కానిస్టేబుళు దీపశ్రీ, వనజ, పద్మలు ప్రమాద స్థలిలో చూపిన చొరవ అభినందనీయం

ప్రమాదానికి గురైన బస్సు వెనుక ప్రయాణిస్తున్న వీరు, ఘటన జరిగిన ఐదు నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్నారు. క్షణమాత్రం ఆలస్యం చేయకుండా, మరో ఏడుగురు కానిస్టేబుళ్లతో కలిసి మొత్తం 11 మంది క్షతగాత్రులకు సీపీఆర్ నిర్వహించి, వారి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారు. బాధితులు స్పృహలోకి రాగానే వెంటనే వారిని ఆస్పత్రులకు తరలించారు.

గాయాలను లెక్కచేయని పోలీస్ ఉక్కు సంకల్పం

ఇటీవల చేవెళ్ల బస్సు-టిప్పర్ ఢీకొన్న ఈ ఘటనలో పోలీసులు గాయాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. చేవెళ్ల, వికారాబాద్, పరిగి సబ్ డివిజన్ల నుంచి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ నియంత్రిస్తూనే, ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీశారు. ఫైర్ సిబ్బందితో కలిసి వెల్డింగ్ కట్టర్ల సాయంతో బస్సు రాడ్లను తొలగించి బాధితులను కాపాడారు. ఈ క్రమంలో పలువురు మహిళా పోలీసులు కు స్వల్ప గాయాలయ్యాయి.

సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడిన మహిళా పోలీసుల సేవాదృక్పథాన్ని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి:
## జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా

కడప, మార్చి 8(భారత శక్తి) : పదవ తరగతి పరీక్షలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేలా బోర్డు నిబంధనల మేరకు అన్ని రకాల చర్యలను పక్కాగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా పరిక్షల నిర్వాహక అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ లోని సభా భవన్ లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత నిర్వహక అధికారులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి జేసీ డా. నిధి మీనా తో పాటు పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్, ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 28,158 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఈ పబ్లిక్ పరీక్షలు మార్చి 16 తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు జిల్లాలోని 169 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే ఈ పబ్లిక్ పరీక్షలను సర్వీస్ కమిషన్ పరీక్షల తరహాలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో గుర్తించిన 9 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపైకి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి మాస్ కాపీయింగ్ కు



పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల పర్యవేక్షణ ఆషామాషీ గా జరిగితే పబ్లిక్ పరిక్షల నిర్వహణకే అర్థం ఉండదన్నారు.అదేవిధంగా ఆ పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, టాయిలెట్స్, త్రాగునీరు, ఫ్యాన్లు, లైట్లు వెంటిలేషన్ అన్నీ సక్రమంగా ఉండేలా జిల్లా యంత్రాంగం 18 శాఖల సమన్వయ సహకారంతో ఏర్పాట్లను సంసిద్ధం చేయడం జరుగుతోందన్నారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖ, మెడికల్, విద్యుత్, పోస్టల్ శాఖలు వారికి సబందించిన విధులను బాధ్యతగా నిర్వర్తించి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా జిల్లా యంత్రాంగం అన్ని జాగ్రత్తలు చేపట్టిందన్నారు.ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే నిర్వాహకులు తీసుకోవలసిన జాగ్రత్తలు విధులు తదితరాంశాలపై మాస్టర్ ట్రైనర్ రెహమాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి శంషుద్దిన్, డిప్యూటీ డీఈవోలు రాజశేఖర్ రెడ్డి, మీనాక్షి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ సాంబశివ రెడ్డి, డిసిఈబి చైర్మన్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు, డిపార్డమెంటల్ అధికారులు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఉస్తాద్ భగత్ సింగ్: దమ్మున్నోడు దాటొచ్చు.. అదిరిపోయిన ట్రైలర్ టీజ్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న అప్డేట్ వచ్చేసింది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్ల వేగాన్ని పెంచిన చిత్రబృందం, తాజాగా 'ట్రైలర్ టీజ్' పేరుతో ఓ చిన్న వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ టీజర్‌లో పవన్ కల్యాణ్ చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. "ఇందాక విన్నది భగవత్ గీత.. ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు" అంటూ పవన్ తనదైన శైలిలో చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. గబ్బర్ సింగ్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా





ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన పాటలు, పోస్టర్లు సినిమాపై హైప్‌ను పెంచగా, తాజా టీజర్ ఆ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లింది. తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వీడియోకు అదనపు బలాన్ని చేకూర్చింది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ సరసన శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఉగాది కానుకగా మార్చి 19న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం సినిమా పనులు చివరి దశలో ఉన్నాయని, త్వరలోనే పూర్తి స్థాయి ట్రైలర్‌ను కూడా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. మొత్తానికి మార్చి 19న థియేటర్లలో పండగ చేసుకోవడానికి పవన్ అభిమానులు సిద్ధమవుతున్నారు.

## సినిమా

## కూతురి ఎంట్రీ కోసం..

టాలీవుడ్‌లో కుటుంబ కథా నాయికగా ప్రత్యేక గుర్తింపు పొందిన నటి లయ. బాలనటిగా భద్రం కొడుకో సినిమాతో తెరంగేట్రం చేసి స్వయంవరం చిత్రంతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు సంపాదించింది. ఆ తర్వాత ప్రేమించు, మనసున్న మారాజు, హనుమాన్ జంక్షన్, శివరామరాజు, అదిరిందయ్యా చంద్రం వంటి సినిమాల్లో నటించింది. పెండ్లి తర్వాత సినిమాలకు దూరమై అమెరికాలో స్థిరపడ్డ ఆమె. కొన్నేళ్ల విరామం తర్వాత మళ్లీ నటనలోకి అడుగుపెట్టింది. తమ్ముడు మూవీతో రీ ఎం ట్రీ ఇచ్చిన ఆమె తాజాగా సాంప్రదాయిని సుప్పిని సుద్ధపూసని మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో నటుడు శివాజీతో కలిసి ముఖ్య పాత్ర పోషించింది. సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న నటి తన కూతురు శ్లోకాకు నటనపై ఇంట్రెస్ట్ ఉందని, సరైన అవకాశం వస్తే ఆమెను కూడా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించింది.



## సల్మాన్‌ఖాన్‌తో జోడీగా?

ఏజ్ పెరుగుతున్నా నయనతార క్రేజ్ ఏమాత్రం తగ్గట్లేదు. లేడీ సూపర్ స్టార్ ట్యాగ్ కు తగ్గట్లు అగ్ర హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు దక్కించుకుంటుంది. ఇటీవల తెలుగులో మెగాస్టార్‌చిరంజీవి తో కలిసి నటించిన 'మన శంకర వరప్రసాద్‌గారు'తో బ్లాక్‌బస్టర్‌హిట్ అందుకుంది. ఇప్పుడు మరో స్టార్ హీరోతో నయన్ ఒక మాస్‌ఎంటర్‌టైనర్‌లో జతకట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే షారుఖ్‌ఖాన్ తో కలిసి జవాన్ మూవీతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు.. తాజాగా సల్మాన్ ఖాన్ కు జోడీగా నటించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తుండగా.. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తారని సమాచారం. సల్మాన్ ఖాన్ ప్రస్తుతం 'గల్వాన్ యుద్ధం' ప్రాజెక్టులో బిజీగా ఉన్నాడు. అది పూర్తి చేసిన తర్వాత ఏప్రిల్‌నుంచి ఈ మూవీ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.



## ఓటీటీలోకి ఫంకీ

టాలీవుడ్ నటుడు విశ్వక్ సేన్ నటించిన కొత్త సినిమా ఫంకీ. జాతి రత్నాలు ఫేమ్ అనుదీప్ కేవీ దర్శకత్వం వహించిన ఈ మూవీ ఫిబ్రవరి 13న రిలీజై ఆశించిన ఫలితాలు రాబట్టలేక పోయింది. సుమారు రూ.25 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కేవలం రూ.10 కోట్లు మాత్రమే రాబట్టినట్లు తెలుస్తోంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి రానుంది. ఈ మేరకు అధికారికంగా ప్రకటన వచ్చేసింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా మార్చి 13 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతానికి తెలుగులో మాత్రమే అందుబాటులో ఉండే అవకాశం ఉంది. సినిమా కథ విషయానికొస్తే.. రూ.4 కోట్ల బడ్జెట్‌తో సినిమా తీస్తానని నిర్మాత సుదర్శన్ హామీ ఇచ్చి రూ.40 కోట్లు ఖర్చు పెట్టిస్తాడు. అయినా కూడా సినిమా పూర్తికాదు. బడ్జెట్ భారీగా పెరిగిపోయిందనే టెన్షన్‌తో నిర్మాత ఆరోగ్యం క్షీణిస్తుంది. దీంతో ఈ సినిమా నిర్మాణ బాధ్యతలను ఆయన కూతురు చిత్ర తీసుకుంటుంది. ఆ తర్వాత ఏం జరిగిందనేది కథ.



## బెంగళూరులో సందడి చేసిన జూనియర్ ఎన్టీఆర్



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తన కొత్త సినిమా లుక్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆదివారం బెంగళూరులోని కిమ్స్ హాస్పిటల్‌లో నూతనంగా నిర్మించిన స్పెషాలిటీ బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రం కోసం పూర్తిగా మారిపోయిన ఆయన మేకోవర్ అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ తన తాత, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. "కర్ణాటకకు రావడం అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చినట్లు ఉంటుంది. 1983 మార్చి 20న ఇదే ఆసుపత్రికి మా తాతగారు శంకుస్థాపన చేశారు. మళ్లీ ఇన్నేళ్లకు అదే నెలలో నేను ఇక్కడికి రావడం నా పూర్వజన్మ సుకృతం. ఇది తాతగారి ఆశీస్సులు, మీ అందరి ప్రేమ వల్లే సాధ్యమైంది" అని అన్నారు. ఆయన్ను చూసేందుకు ఆసుపత్రి వద్దకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వారికి అభివాదం చేస్తూ, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. "డాక్టర్ అయితే ఏ స్పెషలిస్ట్ అవుతారు?" అన్న ప్రశ్నకు, తనకు పిల్లలంటే ఇష్టం కాబట్టి పీడియాట్రిషియన్ అవుతానని సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా కోసం ఆయన చెవికి రింగ్ పెట్టుకుని కొత్త హెయిర్‌స్టైల్‌తో కనిపించారు. ఈ చిత్రంలో ఆయన సరసన రుక్మిణీ వసంత్ నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్టీఆర్ పుట్టినరోజైన మే 20న సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

## మాధురి దీక్షిత్ చిన్న కుమారుడ్ని చూశారా..!



బాలీవుడ్ ఎవర్ గ్రీన్ బ్యూటీ, 'ధక్ ధక్' గర్ల్ మాధురీ దీక్షిత్ ఇంట సంబరాలు నెలకొన్నాయి. ఆమె చిన్న కుమారుడు రియాన్ ఆదివారం 21వ ఏట అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా మాధురీ దీక్షిత్, ఆమె భర్త డాక్టర్ శ్రీరామ్ నేనే తమ కుమారుడికి సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రియాన్ చిన్ననాటి నుంచి ఇప్పటివరకూ ఉన్న అపురూపమైన జ్ఞాపకాలతో కూడిన ఒక వీడియోను వారు అభిమానులతో పంచుకున్నారు. ఈ వీడియోలో రియాన్ కేవలం చిన్నప్పటి అల్లరి మాత్రమే కాకుండా.. అతడిలోని ప్రత్యేక ప్రతిభను కూడా తల్లిదండ్రులు చూపించారు. కార్ రేసింగ్, వెయిట్ లిఫ్టింగ్, పియానో వాయించడం వంటి అంశాల్లో రియాన్ నైపుణ్యాన్ని చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. తమ కుమారుడి ఎదుగుదల పట్ల గర్వంగా ఉందని మాధురీ పేర్కొన్నారు.

## 'భూమా దేవి' నా హృదయానికి దగ్గరైన పాత్ర: రష్మిక



నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎంతో ఉత్సాహంగా ఉన్న రష్మిక.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులు 2025'లో ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. శనివారం వెలువడిన ఈ ఫలితాల్లో 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రంలోని ఆమె అద్భుత నటనకు గాను ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా రష్మిక సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. "గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌లో ఉత్తమ నటిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. నిజంగా కృతజ్ఞురాలిని. ఈ సినిమాలో నేను పోషించిన 'భూమా దేవి' పాత్ర నా మనసుకు ఎంతో దగ్గరైంది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన దర్శకుడు రాహుల్ రవీంద్రన్, గీతా ఆర్ట్స్ సంస్థ, నిర్మాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# నితి ఆయోగ్ ప్రాంతీయ ఉత్తమ పద్ధతుల సెమినార్‌కు ఎంపికైన పెంబి బ్లాక్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 08 (భారత శక్తి): నిర్మల్ జిల్లాకు గర్వకారణంగా పెంబి బ్లాక్‌ను నితి ఆయోగ్ నిర్వహిస్తున్న ప్రాంతీయ ఉత్తమ పద్ధతుల సెమినార్‌కు ఎంపిక చేశారు. ఈ సెమినార్ మార్చి 9న విశాఖపట్నంలో నిర్వహించబడుతుంది. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద అమలవుతున్న ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాల ప్రతినిధులతో పంచుకునే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సౌత్ జోన్-3కు చెందిన ఆరు రాష్ట్రాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేవలం నిర్మల్, జోగులాంబ గద్వాల్ జిల్లాలు మాత్రమే ఎంపిక కావడం విశేషం. నిర్మల్ జిల్లాలోని పెంబి బ్లాక్ విద్య, ఆరోగ్యం, అమ్మ రక్షిత, బాలశక్తి, వ్యవసాయం, ప్రాథమిక వసతుల రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలను ఈ సెమినార్‌లో ప్రదర్శించనుంది. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ కార్యక్రమానికి హాజరై పెంబి బ్లాక్‌లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారు. గిరిజన ప్రాంతమైన పెంబి మండలంలో గతంలో విద్యారంగంలో తక్కువ అక్షరాస్యత, పత్తి కోత కాలంలో విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లు, ఉపాధ్యాయుల కొరత, తక్కువ పరీక్షా ఫలితాలు వంటి సమస్యలు ఉండేవి.



ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద గత రెండు సంవత్సరాల్లో పలు చర్యలు తీసుకున్నారు. విద్యా వాలంటీర్లను నియమించడం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం, మోడల్ పరీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం వల్ల చదువుపై ఆసక్తి పెరిగి పదవ తరగతి ఫలితాలు 100 శాతం నమోదు అయ్యాయి. పెంబి బ్లాక్ అభివృద్ధిని పర్యవేక్షించేందుకు సీనియర్ జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా పలు ఆవిష్కరణాత్మక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. బాలశక్తి, అగ్రో ఫారెస్ట్రీ, మహిళా శక్తి, అమ్మ రక్షిత వంటి కార్యక్రమాలు, అన్ని శాఖల సమన్వయంతో పెంబి బ్లాక్ ఆస్పిరేషనల్ బ్లాక్ కింద ఉత్తమ పద్ధతులలో ఒకటిగా నిలిచింది. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందడం, మట్టిపరీక్ష కార్డులు అందించడం, పోషకాహార లోపం తగ్గడం వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి సాధించబడింది. ఈ విజయానికి అన్ని శాఖల సమిష్టి కృషే కారణమని అధికారులు తెలిపారు. 2024 డిసెంబర్‌లో నితి ఆయోగ్ నిర్వహించిన ర్యాంకింగ్స్‌లో దేశంలోని 500 బ్లాకుల్లో పెంబి బ్లాక్ నాలుగో స్థానం సాధించి రూ.1 కోటి ప్రోత్సాహక నగదు అందుకుంది.

## దొడర్నా గ్రామంలో
## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 08 (భారత శక్తి): కుబీర్ మండలంలోని దొడర్నా గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం పురోగతి ప్రకారం ప్రభుత్వం నుంచి నిధులు తమ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం వల్ల గిరిజన మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు గృహాలను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గోనెలు కళ్యాణ్, మాజీ జెడ్పీటీసీ చౌవాన్ శంకర్, గ్రామ సర్పంచ్ వందన బాయి, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ ఏఎంసీ చైర్మన్ సంతోష్, ఎక్స్ జెడ్పీటీసీ సంజయ్, ఏఎంసీ డైరెక్టర్ అరుణ్, మాజీ సర్పంచ్ విజయ్, మండల సీనియర్ నాయకులు సూది రాజన్న, సాయి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌ఎస్‌ఐ హైదరాబాద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో
## ఘనంగా మహిళా దినోత్సవం

హైదరాబాద్, మార్చి 8 (భారత శక్తి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (PRSI) హైదరాబాద్ చాప్టర్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని హైదరాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంబంధాల నిపుణులు, మహిళా నాయకులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అకాడెమిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. పుష్ప చక్రపాణి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సాధికారతకు హైదరాబాద్ చాప్టర్ తీసుకుంటున్న చర్యలను ఆమె అభినందించారు. 1908లో అమెరికాలో మహిళా కార్మికుల ఉద్యమం నుంచే మహిళా దినోత్సవానికి ఆరంభమైందని, అనంతరం ఐక్యరాజ్యసమితి 1975లో మార్చి 8ను అధికారికంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గుర్తించిందని వివరించారు. మహిళలకు సంబంధించిన కార్యక్రమాల్లో పురుషుల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని ప్రొఫెసర్ పుష్ప పేర్కొన్నారు. మహిళలు లేకుండా సమాజం కొనసాగలేదని, విద్య హక్కును ప్రాధాన్యంగా తీసుకుంటేనే అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమని ఆమె సూచించారు. కార్యాలయాల్లో మహిళల రక్షణ కోసం అమలులోకి వచ్చిన "పనిస్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం మరియు పరిష్కారం చట్టం - 2013 (పోష్ చట్టం)" ప్రాముఖ్యతను కూడా ఆమె వివరించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న అంతర్జాతీయ యోగా శిక్షకురాలు, కళాకృతి యోగా సంస్థ వ్యవస్థాపకురాలు యశస్విని మహిళల పాత్ర కుటుంబం మరియు సమాజంలో ఎంతో కీలకమని



అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ అత్యంత అవసరమని, రోజూ యోగా సాధన చేయాలని సూచించారు. ఉదయం లేవగానే ఇంటి పనుల్లో పడకుండా స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తూ శరీరానికి, మనసుకు శాంతినిచ్చే కార్యక్రమాలతో రోజును ప్రారంభించాలని ఆమె సూచించారు. మరో ప్రత్యేక అతిథి, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత మరియు ప్రముఖ క్యారమ్ క్రీడాకారిణి డాక్టర్ షేక్ హుస్నా సమీర తన విజయ ప్రయాణాన్ని పంచుకున్నారు. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో పెంచిన తన తల్లే తన విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. తాను కేవలం తల్లి కుమార్తె మాత్రమే కాకుండా భారతదేశపు కుమార్తె అని పేర్కొంటూ, మహిళలు తమ పిల్లల్లో వ్యక్తిగత గుర్తింపుకంటే దేశభక్తి, బాధ్యతాభావం పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పీఆర్‌ఎస్‌ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ యాదగిరి కంభంపాటి మాట్లాడుతూ... మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి మహిళల సాధికారత, వృత్తి పరమైన అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను నిర్వహించడం తమకు గర్వకారణమని తెలిపారు. మహిళా విభాగం కన్వీనర్ మరియు సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకురాలు అపర్ణ రాజహంస మాట్లాడుతూ.. ప్రజాసంబంధాల విద్యా కార్యక్రమాలను అందిస్తూ విద్యార్థినులకు ప్రయోజనం చేకూరేలా పీఆర్‌ఎస్‌ఐ కార్యక్రమాలకు తమ సంస్థ ఎప్పుడూ మద్దతు ఇస్తోందని చెప్పారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ చాప్టర్ కార్యదర్శి రాజేష్ కల్యాణ, మహిళా విభాగం సహ కన్వీనర్ డాక్టర్ అనురాధ మెడా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ రిలేషన్స్ వాయిస్ జర్నల్ సంపాదకులు వై. బాబ్జీ మాట్లాడుతూ ..మహిళా దినోత్సవాన్ని నిర్వహించిన చాప్టర్ నాయకత్వాన్ని అభినందించారు. 2002లో తాను చైర్మన్‌గా ఉన్న సమయంలోనే హైదరాబాద్ చాప్టర్‌లో ప్రత్యేక మహిళా విభాగం ఏర్పాటు చేయాలనే ఆలోచనను ముందుకు తెచ్చినట్లు తెలిపారు. స్వంత రాజ్యాంగంతో మహిళా విభాగాన్ని కలిగి ఉన్న ఏకైక చాప్టర్‌గా హైదరాబాద్ చాప్టర్ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే. చెన్నయ్య, పి. మోహన్ రావు, వి. మధుసూదన్, ఎస్. సరస్వతి, ఎస్. సుజాత, గీత మల్లికార్జునన్, కొంపెల్ల శర్మ, హాజీరా తదితరులు, మహిళా ప్రజాసంబంధ నిపుణులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## మహిళలందరికీ
## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

*** జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 08(భారత శక్తి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మహిళలందరికీ, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకుంటున్నారని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.



## బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు

**: భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఉస్తెల సృజన**

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 8: బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని రోజు రోజుకు మహిళలపై దాడులు జరుగుతున్నాయని భారత జాతీయ మహిళా సమైక్యఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవనంలో నిర్వహించిన మహిళ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేసి ఆమె మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ అమలు పరచడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని వాపోయారు.షీ టీం బృందాలు సంఖ్యను పెంచాలని పాఠశాల, కళాశాల బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో ప్రధాన కూడళ్లల్లో మహిళలను, బాలికలను వేధిస్తున్న ఆకతాయిలను గుర్తించి కఠినంగా శిక్షించాలని అన్నారు. ఆదివారం హైదరాబాదులో సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో మహిళ దినోత్సవ కార్యక్రమానికి జిల్లా నుండి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉప్పునూతల కోటమ్మ,అంజమ్మ, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు దేశ గాని హేమలత, పొదల వెంకటమ్మ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధూర్ గ్రామంలో ఘనంగా
## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 08 (భారత శక్తి): భైంసా మండలంలోని సిద్ధూర్ గ్రామపంచాయతీలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా శక్తి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలెప్ దుర్పతి బాయి, ఉప సర్పంచ్ అవినాష్, పంచాయతీ కార్యదర్శి కైసర్, గ్రామ పెద్ద రాములుతో పాటు వార్డ్ సభ్యులు మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలోని మహిళా వార్డ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు, ఆశా వర్కర్లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాట్లాడిన





గ్రామ పెద్దలు మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామ అభివృద్ధి, ఆరోగ్యం, పిల్లల విద్య మరియు సంక్షేమ కార్యక్రమాల్లో మహిళల సేవలు ఎంతో ముఖ్యమని కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి సమాజ అభివృద్ధికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సన్మానిత మహిళలు గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సేవలను గుర్తించి సన్మానం చేయడం ఆనందంగా ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, మహిళా సంఘాల సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది మరియు గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి రిబ్బన్ కట్ చేసిన
## రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకుడు మహమ్మద్ ఇలియాస్

కామారెడ్డి జిల్లా , మార్చి 08 (భారత శక్తి): బిబిపేట్ మండలం కోనాపూర్ గ్రామంలో చెప్యాల లత నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇలియాస్ హాజరై, రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన నూతన గృహంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని, లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదవాడి సొంతింటి కల సాకారం కావడమే ప్రభుత్వ ధ్యేయమని, యువతరం ఇలాంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుండాలని ఆయన ఆకాంక్షించారు.

*** చెప్యాల లత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.**

ఈ సందర్భంగా లబ్ధిదారు చెప్యాల లత



మాట్లాడుతూ, తమకు సొంతింటి కల నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన యువ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ తమ చేతులతో ఇల్లు ప్రారంభించడం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, (పీసీసీ జనరల్ సెక్రటరీ) సుతారి రమేష్ (బిబిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు), రాజు (మార్కెట్ కమిటీ చైర్మన్) మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ఇంద్రసేనారెడ్డి, మట్ట సీను సాత్విక సాయినాథ్, వెంకట్ గౌడ్, వెంకట్రావు, చెప్యాల రాజేష్, దడిగే శేఖర్, రవీందర్ రెడ్డి, నాగేశ్వర్, సలీం, మహేష్, శ్రవణ్ గౌడ్, గాడి లింగం, తోట రమేష్, నరసింహారెడ్డి, నాగరాజు, రవి, స్వామి, గంప ప్రసాద్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన భర్త

సూర్యాపేట , మార్చి 08 (భారత శక్తి):కుటుంబ కలహాలతో భార్యను భర్త హత్య చేసిన ఘటన జిల్లాలో సంచలనం రేపింది. తెలిసిన వివరాల ప్రకారం, జిల్లాలోని ఇంద్రమ్మ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీను తన భార్యపై అనుమానం పెంచుకుని తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఆవేశంలో భార్య తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న



పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానిక ఇందిరమ్మ కాలనీలో విషాద వాతావరణం నెలకొంది.

# శాస్త్రవేత్తల స్థాయికి విద్యార్థులు ఎదగాలి : ప్రొఫెసర్ ఎం. ప్రసాద్

హైదరాబాద్, మార్చి 08 (భారత శక్తి): వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంచుతాయని ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం హెచ్ ఓడీ డాక్టర్ మీసాల. ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డి. జోసఫిన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్ లో 'న్యూరోనోవా సైన్స్ ఫెస్ట్' ను నిర్వహించారు. విద్యార్థులు సొంతంగా రూపొందించి ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆయన సందర్శించారు. అనంతరం ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ, పరిశోధనలపైనే దేశాభివృద్ధి



ఆధారపడి ఉందన్నారు. డిగ్రీ చదివే విద్యార్థులు పరిశోధనా రంగంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. యువత తమ బాధ్యతలను గుర్తించి సరైన మార్గంలో పయనించాలని కోరారు. కొత్త పరిశోధనలు చేస్తూ విద్యార్థులు శాస్త్రవేత్తల స్థాయికి ఎదగాలని అన్నారు. మానవ వికాసానికి కొత్త కొత్త ఆవిష్కరణలు జరపవలసి ఉంటుందని అన్నారు. విద్యార్థి దశలో పరిశోధన తత్వాన్ని విజ్ఞాన ప్రదర్శనల ద్వారా చేకూరుతుందని ఆయన అన్నారు.ప్రతి విద్యార్థి విజ్ఞాన ప్రదర్శన పోటీలో పాల్గొని తన విజ్ఞతను ప్రదర్శించాలని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో జాగృతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఓ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డి.జోసఫిన్ రెడ్డి, కార్యదర్శి ఎ. శశికిరణ్ రెడ్డి, ఎన్. నీతారెడ్డి, సంతోష్ రెడ్డి, మధుసూధన్, ఓప శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థిణిలు, తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో హ్యూమన్ పాఫిలోమా వైరస్ టీకా ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 08 (భారత శక్తి): వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ నందు (HPV) వ్యాక్సిన్ ( హ్యూమన్ పాఫీలోమా వైరస్ టీకా) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలి,ఆహారపు అలవాట్లు కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి విస్తరిస్తుందన్నారు. రాష్ట్రంలో ఏటా కొత్తగా 55 నుంచి 60 వేల వరకు క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని అన్నారు.క్యాన్సర్ నివారణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు హెచ్. పీ.వీ వ్యాక్సిన్ ( హ్యూమన్ పాఫీలోమా వైరస్) వ్యాక్సినేషన్ టీకా ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్ ముప్పును



చాలా వరకు తగ్గించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిట్టా రాజశేఖర్ రెడ్డి,డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, మహేశ్వరం, వనస్థలిపురం సూపరిడెంట్లు నాగేందర్, కృష్ణ,వనస్థలిపురం ఆర్ఎంఓ జయమాల,పలువురు డాక్టర్లు గఫర్,అనిత, కిరణ్, గీత, అర్చన,సుస్మిత,స్వర్ణలత,తిరుమల రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్ రావు, అనురాధ, మాధవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో అక్రమ సంబంధంతో హత్య

* **ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్ కు తరలింపు**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 08 (భారత శక్తి): స్థానిక సిద్ధార్థ కాంప్లెక్స్ లాడ్జిలో జరిగిన భూక్య మోహన్ హత్య కేసును వేములవాడ పట్టణ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు.ఈ కేసులో ప్రధాన నిందితురాలు బైరి శారద అలియాస్ కళ్యాణితో పాటు ఆమె భర్త బైరి శేకర్, సహకరించిన గుండం రవి అలియాస్ రవీందర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడ అంజనీనగర్‌లో నర్సుగా చేస్తున్న బైరి శారదకు, మృతుడు భూక్య మోహన్‌కు మధ్య అక్రమ సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో మోహన్ తరచూ డబ్బులు కావాలని శారదను వేధించడమే కాకుండా, వారిద్దరూ కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలను బయట పెడతానని బెదిరించసాగాడు. ఈ వేధింపులు భరించలేక శారద తన భర్త శేకర్ తో కలిసి మోహన్‌ను వదిలించుకోవాలని పథకం రచించింది.ఈ



క్రమంలో గుండం రవి అనే వ్యక్తి సహాయం తీసుకున్నారు. ఈ నెల 4వ తేదీన శారద పథకం ప్రకారం మోహన్‌ను వేములవాడలోని సిద్ధార్థ కాంప్లెక్స్‌కు పిలిపించింది. అక్కడికి చేరుకున్న శేకర్, రవిలు కలిసి నైలాన్ తాడుతో మోహన్ గొంతు నులిమి హత్య చేశారు. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు తిప్పాపూర్ బస్ స్టాండ్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన బైక్, నైలాన్ తాడు మరియు చాకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను పట్టుకున్న వేములవాడ టౌన్ సీఐ వీర ప్రసాద్, ఎస్ఐలు రామ్మోహన్, ప్రేమానందం, పిసిలు ఇమ్రాన్, సల్మాన్, శ్రీనివాస్‌లను వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఆర్థిక లావాదేవీల గురించి గలాట..ఒకరి మృతి

ఎల్బీనగర్, మార్చి 08 (భారత శక్తి): చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సతీష్ అనే వ్యక్తికి యెడ్ల యాదయ్య అనే వ్యక్తికి మధ్య డబ్బుల లావాదేవీలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం ఉదయం సుమారు 7 గంటల 30 నిమిషాల సమయంలో సతీష్ తన హోటల్‌లో పనిచేసే ఇద్దరు వ్యక్తులతో కలిసి చైతన్యపురి మెట్రో స్టేషన్ సమీపానికి వచ్చి అక్కడ ఉన్న యాదయ్యను డబ్బుల విషయమై ప్రశ్నించగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సతీష్‌తో కలిసి వచ్చిన వారు యాదయ్యపై దాడి చేసినట్లు తెలుస్తోంది. దాడిలో యాదయ్య స్పృహ తప్పి కుప్పకూలిపోయాడు.వెంటనే అతడిని ఆటోలో సమీపంలోని జీబీఆర్ హాస్పిటల్‌కు తరలించగా, హాస్పిటల్ లో డ్యూటీ డాక్టర్



పరీక్షించి యాదయ్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ఈ ఘటనపై యాదయ్య తండ్రి యెడ్ల కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ సైదులు తెలిపారు.

## జుబ్లీహిల్స్‌లో అత్యాధునిక 'ఎన్ విజన్ లాసిక్ సెంటర్' ప్రారంభం

* **ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్**

జుబ్లీహిల్స్, మార్చి 08 (భారత శక్తి): సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వైద్య రంగంలో మరిన్ని మెరుగైన సేవలు అందించడం అభినందనీయమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. జుబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సాయిబాబా గౌడ్ కుమారుడు డాక్టర్ అద్వైత్ నూతనంగా ఏర్పాటు చేసిన *'ఎన్ విజన్ లాసిక్ సెంటర్' (కంటి ఆసుపత్రి)*ను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో, అధునాతన సాంకేతికతతో ఈ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకువచ్చిన డాక్టర్ అద్వైత్, డాక్టర్ సింధూరలను ప్రత్యేకంగా అభినందించారు. కంటి సమస్యలతో బాధపడేవారికి ఈ కేంద్రం ఎంతో ఊరటనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జ్యోతి గారికి సన్మానం**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, దేవనార్ అంధుల పాఠశాల





కరస్పాండెంట్ జ్యోతి గారిని మధుయాష్కి గౌడ్ ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సమాజ సేవలో ఆమె చేస్తున్న కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ గౌడ్స్ డెంటల్ ఆసుపత్రుల వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.ఎస్. గౌడ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ డైరెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంజి ప్రసాద్ మృతి కాపు సంఘానికి తీరని లోటు

**: మధుయాష్కి గౌడ్**

వనస్థలిపురం, మార్చి 08 (భారత శక్తి): వనస్థలిపురం కాపు సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు అంజి ప్రసాద్ హఠాన్మరణం పట్ల టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుండెపోటుతో అంజి ప్రసాద్ మరణించిన విషయం తెలిసి, ఆయన నివాసానికి వెళ్లిన మధుయాష్కి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కుటుంబ సభ్యులకు ధైర్యం**

బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని అంజి ప్రసాద్ నివాసంలో మధుయాష్కి కొద్దిసేపు గడిపారు. ఆయన మృతితో దుఃఖంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. అంజి ప్రసాద్తో తమకున్న అనుబంధాన్ని గుర్తు



చేసుకున్నారు. ఈ సంతాప కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మకుటం సదాశివుడు, ఎల్బీనగర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, నాయకులు పర్వతి గణేష్ రెడ్డి, భీమిడి రామకృష్ణారెడ్డి, ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ పటేల్, కొండోజు శ్రీనివాస్, అంతటి శ్రీనివాస్ గౌడ్, సాయికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శివనాగిరెడ్డి కి కాంగ్రెస్ నేతల నివాళి

* **సంతాపం తెలిపిన మంత్రి పొంగులేటి సతీమణి మాధురి**
* **టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులు ఉమ్మినేని కృష్ణ,**

ఖమ్మం బ్యూరో, మార్చి 08 (భారత శక్తి): ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గడ్డం శివనాగిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన దశదినకర్మ వారి స్వగృహంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి, టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులు ఉమ్మినేని కృష్ణ, మండల కాంగ్రెస్ నాయకులు బోయినపల్లి మురళి, బంధం శ్రీనివాస్, సురభి నర్సింహారావు, షేక్ బాబు, తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. శివనాగిరెడ్డి చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులర్పించారు. శివనాగిరెడ్డి



సోదరులు శ్రీకాంత్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారితో పాటు ఇతర కుటుంబ సభ్యులు తండ్రి సుబ్బారెడ్డి, తల్లి వెంకటరమణమ్మ, మరదలు లాస్యశ్రీలతో మంత్రి సతీమణి మాధురి మాట్లాడారు. నాగిరెడ్డి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులు అర్పించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు కె. శ్రీనివాసరెడ్డి, దువ్వా సాగర్, కూరాకుల గోపీ, క్యాంపు కార్యాలయ సిబ్బంది సురేష్, చంద్రశేఖర్, రామకృష్ణ, ప్రవీణ్,

## బన్ టీ కేఫ్ ను ప్రారంభించిన ఏ.ఐ.సీ.సీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



సూర్యాపేట, మార్చి 08 (భారత శక్తి): జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాదిగారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, రాపర్తి భవాని శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ అనంతుల యాదగిరి, గాజుల మల్కాపురం సర్పంచ్ నాతల వెంకట్ రెడ్డి, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ళ రమేష్, సేవాదల్ ఆలేటి మాణిక్యం, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దెబోయిన శ్రీనివాస్, కక్కిరెని శ్రీనివాస్ గౌడ్, అన్నమయ్య రాము, కోడి శివ, చెరుకు రాము, గుణగంటి సైదులు, దండా వెంకట్ రెడ్డి, అనంతుల నాగరాజు, పిన్ని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలీ: కౌన్సిలర్ సునీల్ రెడ్డి

సూర్యాపేట, మార్చి 08 (భారత శక్తి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ 6 వార్డు కౌన్సిలర్ సునీల్ రెడ్డి అన్నారు.ఆదివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రూపొందించిన ప్రజాపాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్డులో నెలకొన్న మౌలిక సమస్యలైన పారిశుద్ధ్యం, కాలువల పరిశుభ్రత, నల్లా కనెక్షన్ల పునరుద్ధీకరణ, ప్రజలకు ఇబ్బందిగా ఉన్న చెట్లు, మొక్కలు తొలగించుట తదితర




సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఈ 99 రోజుల ప్రణాళిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు.6 వార్డు లో ప్రతి ఒక్కరూ తమ పరిసరాల ను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.కాల్వలు శుభ్రంగా ఉండి నీరు నిలవకుండా ఉంటే దోమల నివారణ సాధ్యమవుతుందని అన్నారు.

# బడా బాబులకు 'రాజ'భోగం.. సామాన్యుడికి పన్ను 'పోటు'!

**హైదరాబాద్, మార్చి 8 (భారత శక్తి):** పేదవాడు గూడు కట్టుకుంటే పన్ను వేటు వేసేందుకు ఉరుకులు పరుగులు పెట్టే బల్దియా అధికారులు, బడా వ్యాపారుల భారీ భవనాల వద్దకు వచ్చేసరికి 'వినయ విధేయత' ప్రదర్శిస్తున్నారు. సామాన్యుడిపై ప్రతాపం చూపే అధికారుల పలకరింపులు, లక్షల రూపాయల పన్ను ఎగవేసే తిమింగలాల వద్ద మాత్రం 'మామూళ్ల' మత్తులో మునిగిపోతున్నాయి.




జీహెచ్ఎంసీ సరూర్ నగర్ సర్కిల్ 5 పరిధిలో వెలుగుచూసిన ఈ భారీ పన్ను అక్రమ ఉదంతం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది.

**రికార్డుల్లో కోత.. జేబుల్లో రాత!**

సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారిపై ఉన్న ఒక భారీ భవన సముదాయం (Property) పన్ను చెల్లింపులో అంతులేని అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి సుమారు 49,400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండాల్సిన సదరు ప్రాపర్టీని, అధికారుల అండదండలతో రికార్డుల్లో మాత్రం కేవలం 29,582 చదరపు అడుగులుగానే చూపిస్తున్నారు. అంటే దాదాపు 20 వేల చదరపు అడుగులకు పన్ను ఎగవేస్తూ ప్రభుత్వ ఖజానాకు కోలుకోలేని దెబ్బ కొడుతున్నారు. ఈ అక్రమాలకు సూత్రధారిగా ఉన్న ఒక ఇన్‌చార్జ్ ఏఎంసీ (AMC), పన్నుల వసూళ్ల కంటే విలాసాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

**మందు.. విందు.. మామూళ్లు!**

సదరు ప్రాపర్టీ యజమాని ఇచ్చే విందుల్లో పన్ను ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఏఎంసీ నిత్యం 'మందు' పార్టీలు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం అంతా స్థానిక ఉన్నతాధికారి (DC) ఆశీస్సులతోనే జరుగుతోందని, నెలకు అందాల్సిన 'కిరాణా' (మామూళ్లు) గట్టిగా అందుతుండటంతో ఆయన కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కార్యాలయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో ఇదే భవనానికి సంబంధించి రూ. 5 లక్షల పన్ను నగదు రూపంలో ఇస్తే, కేవలం రూ. 2 లక్షలు మాత్రమే ప్రభుత్వ ఖాతాలో జమ చేసి, మిగిలిన రూ. 3 లక్షలను ఇంచార్జ్ ఏఎంసీ తన జేబులో వేసుకున్నట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి.

*** జెడ్సీ వైఫల్యమేనా? పెండింగ్‌లో వేల దరఖాస్తులు!**

సరూర్ నగర్ సర్కిల్ లో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా, మన్సూరాబాద్ అసెస్మెంట్ లో అవకతవకలు బయటపడి నెలలు గడుస్తున్నా.. జోనల్ కమిషనర్ హేమంత్ పటేల్ గారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గడ్డిఅన్నారం పరిధిలో సామాన్య పన్ను దారులు తమ దరఖాస్తుల కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్నా అధికారుల కనికరం కలగడం లేదు.




- చేయి తడిపితే: దరఖాస్తు చేసిన మరుసటి రోజే అప్రూవల్ వస్తుంది.
- నీతిగా ఉంటే: అన్ని పత్రాలు ఉన్నా నెలలు, ఏళ్ల తరబడి ఆన్‌లైన్ లో 'పెండింగ్' లేదా 'రిజెక్ట్' ముద్ర వేస్తున్నారు.

**ప్రజల ప్రశ్న: 'ఉక్కుపాదం' ఎక్కడ?**

కుప్పలు తెప్పలుగా ఆన్‌లైన్ లో పెండింగ్ ఉన్న అప్లికేషన్లపై, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన అధికారులపై జోనల్ కమిషనర్ ఎందుకు ఉక్కుపాదం మోపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిన్న దుకాణాలను సీజ్ చేసే ఉత్సాహం, లక్షల పన్ను ఎగవేస్తున్న ఈ బడా భవనంపై ఎందుకు చూపడం లేదు? ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపితే తప్ప ఈ 'పన్ను దోపిడీ'కి అడ్డుకట్ట పడదు.

## ఆకాశంలో సగం కాదు... నింగీ నేలా మీరే

అమరావతి, మార్చి 8 (భారత శక్తి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా మహిళల త్యాగాలను, శక్తిని కొనియాడుతూ ఓ ఆసక్తికరమైన సందేశాన్ని విడుదల చేశారు. "అమ్మా.. నీవు ఆకాశంలో సగం కాదమ్మా.. నింగీ నేలా నీవే. ఈ సృష్టి మీది.. మా జన్మ మీది" అంటూ మహిళల ప్రాధాన్యతను లోకేశ్ గొప్పగా వర్ణించారు. అమ్మ, భార్య, సోదరి, కుమార్తె, పిన్ని, మరదలు ఇలా ప్రతి రూపంలోనూ మనల్ని కంటికి రెప్పలా కాపాడే మాతృమూర్తులందరికీ వందనాలు సమర్పించారు. ఈ సందర్భంగా తన కుటుంబం, పార్టీ మహిళల కోసం చేసిన కృషిని లోకేశ్ గుర్తుచేశారు. మహిళలను గౌరవించాలనే నైతిక విలువలను తన తల్లి చిన్నప్పుడే నేర్పించారని, దివంగత ఎన్టీఆర్ ఆడపడుచులకు ఆస్తిహక్కు కల్పిస్తే.. తన తండ్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి', 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తోందని, ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. భావితరాల్లో మహిళల పట్ల గౌరవం పెంచేందుకు విద్యావ్యవస్థలో కీలక మార్పులు చేశామని లోకేశ్ వెల్లడించారు. నైతిక విలువల సలహాదారుగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమించి, వారి సూచనలతో పాఠ్యాంశాల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో స్త్రీ, పురుషులను సమానంగా చూపే చిత్రాలనే ముద్రించామన్నారు. సమాజంలో తరచూ వినిపించే "ఆడపిల్లలా ఏడవొద్దు", "గాజులు తొడుక్కోలేదు", "చీర గాజులు పంపిస్తా" వంటి మాటలు ఎవరు మాట్లాడినా తప్పేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మహిళలను కించపరిచే భాష, సన్నివేశాలు ఉండకూడదని తాను పోరాడుతున్నట్లు చెప్పారు.

## మహిళాభివృద్ధి కోసం
# 'స్వయం' బ్రాండ్... నేనే అంబాసిడర్‌గా ఉంటా

అమరావతి, మార్చి 8 (భారత శక్తి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 201924 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు. "మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు. ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే అని గుర్తుచేశారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని, ఆ నిర్ణయం వల్లే నేడు ఐటీ వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వివరించారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన
# నన్ను కలచివేసింది: పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 8 (భారత శక్తి): పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో జరిగిన 'అంతర్జాతీయ సంతాల్ సదస్సు' నిర్వహణ తీరు, అక్కడ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎదురైన పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ద్రౌపది ముర్ము, అక్కడి పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని, అవి తనను తీవ్ర ఆందోళనకు గురిచేశాయని పవన్ పేర్కొన్నారు. సంతాల్ సామాజిక వర్గం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఒక సదస్సును నిర్వహించినప్పుడు, అందులో ఆ వర్గానికి దక్కాల్సిన గౌరవం, ప్రాధాన్యత కచ్చితంగా ఉండాలని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఎవరి కోసమైతే ఈ సదస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేశారో, ఆ సంతాల్ కమ్యూనిటీకి చెందిన సభ్యులే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. ఇలాంటి సాంస్కృతిక సమావేశాలు అందరినీ కలుపుకుపోయేలా, సున్నితత్వంతో కూడిన పరిపాలనా ప్రణాళికతో జరగాలని హితవు పలికారు. ముఖ్యంగా భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి అని, ఆ పదవికి, ఆ వ్యవస్థకు ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం దక్కాలని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలని, అది ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం బాధ్యత అని స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటనలో ప్రొటోకాల్, మర్యాదలకు భంగం వాటిల్లడం సరికాదన్నారు. భారతదేశ అస్తిత్వంలో, మన దేశ ఖ్యాతిలో గిరిజన సమాజాలు అంతర్భాగమని పవన్ కల్యాణ్ కొనియాడారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, వారి గళానికి ఎల్లప్పుడూ నిజాయతీతో కూడిన గౌరవం లభించాలన్నారు. గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా, రాజ్యాంగ అధిపతికి అసౌకర్యం కలిగించేలా జరిగిన ఈ సంఘటన దురదృష్టకరమని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా పాలకులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# త్వరలోనే తెలంగాణలో ఉచిత స్కూటీలు: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 8 (భారత శక్తి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థినులకు తీపి కబురు అందించారు. చదువుకునే ఆడబిడ్డల ప్రయాణ కష్టాలను తీర్చడంతో పాటు, వారిని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తరఫున ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజాభవన్‌లో ఘనంగా జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం.. మహిళా సాధికారతకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు... త్వరలోనే ఈ ఉచిత స్కూటీల పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు, గృహలక్ష్మి పథకం ద్వారా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇవ్వడం ద్వారా వారి విద్యకు, స్వావలంబనకూ మరింత తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు.

**హైదరాబాద్‌కు కాలుష్య విముక్తి**

నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు మరో భారీ నిర్ణయాన్ని సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో కాలుష్యమే పెద్ద అడ్డంకిగా మారిందని, ఇది నాన్ లివింగ్ సిటీగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. డిసెంబర్ 9వ తేదీలోపు నగరంలో డీజిల్ బస్సులు కనిపించవని, ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులన్నింటినీ జిల్లాలకు తరలిస్తామని తెలిపారు. నగర ప్రజల కోసం ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు. అంతేకాకుండా, నగరంలో తిరిగే పెట్రోల్, డీజిల్ ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తామని చెప్పారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తే 'జీరో ట్యాక్స్' విధిస్తామని, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను వెలుపలికి తరలిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# కొత్త హంగులతో తెలంగాణ శాసన మండలి భవనం ప్రారంభం

హైదరాబాద్, మార్చి 8 (భారత శక్తి): తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని చారిత్రక పాత అసెంబ్లీ భవనం ఇకపై శాసన మండలి (లెజిస్లేటివ్ కౌన్సిల్)గా సేవలు అందించనుంది. అత్యాధునిక హంగులతో ఆధునీకరించిన ఈ భవనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాలు ఈ కొత్త భవనంలోనే జరగనున్నాయి. నిజాం కాలం నాటి ఇండో సార్సెనిక్ వాస్తుశైలిలో నిర్మితమైన ఈ భవనంలో గతంలో హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీ, ఆ తర్వాత ఉమ్మడి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరిగేవి. 2014 రాష్ట్ర విభజన తర్వాత దీనిని ఏపీ అసెంబ్లీకి కేటాయించారు. అయితే ఏపీ అసెంబ్లీ అమరావతికి తరలివెళ్లడంతో ఈ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అసెంబ్లీ మరియు కౌన్సిల్ రెండూ ఒకే ప్రాంగణంలో ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ (ఏకేటీసీ) సహకారంతో రూ.30 కోట్లతో 18 నెలల పాటు ఈ పనులు సాగాయి. ఇందులో అధునాతన డ్రైనేజీ, ఎలక్ట్రికల్ సిస్టమ్స్, ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. సీఎం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కోసం ప్రత్యేక ఛాంబర్లు, మీడియా హాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ భవనం పార్లమెంట్ తరహాలో ఎంతో అద్భుతంగా ఉందని, సభ్యులకు అన్ని సౌకర్యాలు కల్పించామని మండలి ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. 2018 నుంచి ఇప్పటివరకు జూబ్లీహాల్‌లో మండలి సమావేశాలు జరుగుతుండగా, ఇకపై ఆ హాల్‌ను ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు వినియోగించనున్నారు. అలాగే ఉభయ సభల సంయుక్త సమావేశాల కోసం కొత్త సెంట్రల్ హాల్ నిర్మించే యోచనలో కూడా ప్రభుత్వం ఉంది.

## గల్ఫ్ దేశాలపై ఇరాన్ భీకర దాడులు...
# కువైట్, సౌదీలలో ఉద్రిక్తత

సౌదీ, మార్చి 8: గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. ఆదివారంతో ఈ ప్రాంతీయ యుద్ధం రెండో వారంలోకి అడుగుపెట్టింది. కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ మరోసారి క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఇంధన ట్యాంకులే లక్ష్యంగా శత్రు డ్రోన్లు చొరబడ్డాయని ఆ దేశ సైన్యం వెల్లడించింది. వీటిని అడ్డుకునే క్రమంలో పడిన శకలాల వల్ల కొన్ని పౌర నివాసాలకు నష్టం వాటిల్లింది. ముందుజాగ్రత్త చర్యగా కువైట్ నేషనల్ ఆయిల్ కంపెనీ ముడి చమురు ఉత్పత్తిని తగ్గించింది. ఇక సౌదీ అరేబియాలో రాజధాని రియాద్‌లోని దౌత్య కార్యాలయాలు, అమెరికా బలగాలున్న 'ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్' లక్ష్యంగా వచ్చిన 15 డ్రోన్లు, 3 బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేసినట్లు సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఖతార్‌పై ప్రయోగించిన 12 క్షిపణులను కూడా విజయవంతంగా అడ్డుకున్నారు. శనివారం దుబాయ్ విమానాశ్రయం పరిసరాల్లో గుర్తుతెలియని వస్తువును కూల్చివేయడంతో, విమానాశ్రయాన్ని కాసేపు మూసివేశారు. ఆకాశంలో జరిగిన ఈ ఇంటర్‌సెప్షన్ వల్ల రాలిన శకలాలు తగిలి ఒక పాకిస్థాన్ జాతీయుడు మరణించాడు. ఈ పరిణామాలపై యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ స్పందిస్తూ.. "ప్రస్తుతం ఎమిరేట్స్ యుద్ధంలో ఉంది, దీని నుంచి మనం మరింత బలంగా బయటపడతాం" అని జాతిని ఉద్దేశించి ప్రసంగించారు.

# రాష్ట్రపతి పర్యటనలో బెంగాల్ ప్రభుత్వం అన్ని హద్దులు దాటింది

ఢిల్లీ, మార్చి 8 (భారత శక్తి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమ బెంగాల్ పర్యటనలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వం తీరుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ ఉల్లంఘనలు, బిధానగర్‌లో జరగాల్సిన అంతర్జాతీయ సంతాల్ సదస్సును హఠాత్తుగా మరోచోటుకు మార్చడంపై మోదీ మండిపడ్డారు. మమతా బెనర్జీ అన్ని హద్దులు దాటారని విమర్శించారు. రాష్ట్రపతికి జరిగిన అవమానానికి ప్రభుత్వ యంత్రాంగానిదే బాధ్యత అన్నారు. ఇది సిగ్గుచేటు విషయమని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, గిరిజన వర్గాల సాధికారతపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరి నైతికస్థైర్యాన్ని దెబ్బతీసేలా మమతా బెనర్జీ చర్య ఉందని ఆరోపించారు. మమతా బెనర్జీ తీరుతో గిరిజన వర్గానికి చెందిన రాష్ట్రపతి పడిన ఆవేదన దేశ ప్రజల మనసుల్లో అపార దుఃఖాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు.

# మద్యపాన నిషేధంతోనే మహిళా సాధికారత

* ఏకీకృత విద్యావిధానంతోనే అసమానతల తొలగింపు**
* రాజ్యాంగ పరిరక్షణ వేదిక సెక్రటరీ చెన్నోజు శ్రీనివాసులు**

హస్తినాపురం, మార్చి 08 (భారత శక్తి): "మద్యపాన నిషేధంతోనే మహిళల ప్రగతి సాధ్యమవుతుందని, సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు మద్యం ప్రధాన కారణమని" రాజ్యాంగ పరిరక్షణ వేదిక సెక్రటరీ చెన్నోజు శ్రీనివాసులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హస్తినాపురంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, మహిళా శ్రామికుల పోరాట ఫలితంగానే నేడు మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. అమెరికాలో పనిగంటల తగ్గింపు కోసం సాగిన ఆ పోరాట స్ఫూర్తి నేటికీ అవసరమన్నారు. మన దేశంలో ఇంకా కొన్ని చోట్ల మహిళా కార్మికులకు పనిగంటలు ఎక్కువగా ఉండటం, వేతనాలు తక్కువగా ఉండటం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

మద్య నిషేధం: పురుషులు మద్యానికి బానిసై మహిళలను వేధిస్తున్నారని, హత్యలు, అత్యాచారాలకు మద్యమే మూలమని, దీనిని వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. ఏకీకృత విద్య: మంత్రుల మనవళ్లు చదివే పాఠశాలల్లో ఉండే సౌకర్యాలు, శ్రమజీవుల బిడ్డలు చదివే బడుల్లోనూ ఉండాలని, అప్పుడే చదువులో సమానత్వం సాధ్యమన్నారు. ఉద్యోగ భద్రత: పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేయాలన్నారు. కుల నిర్మూలన, స్త్రీ పురుష సమానత్వం సాధించాలంటే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు నక్క యదీశ్వర్, జైస్వరాజ్ పార్టీ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్, రాజ్యాంగ పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు రాయబండి పాండురంగం, గంగుల నరసింహారెడ్డి మరియు జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో చండీ హోమం

రామకృష్ణాపురం, మార్చి 08 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని శ్రీ రామకృష్ణాపురం డివిజన్లో గల శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ 52వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చండీ హోమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ నేత పున్న నిర్మల గణేష్ నేత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆమె స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ తలాటి రమేష్ నేత, ఈవో ఉమారాణి, డైరెక్టర్లు సాయికుమార్, శ్యాం సుందర్ రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, విజయలక్ష్మి, అన్నపూర్ణమ్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసరాలు భక్తుల కోలాహలంతో సందడిగా మారాయి.



**అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో సీఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.సీఐ సైదిరెడ్డి, అడ్మిన్ ఎస్ఐ గంగాధర్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మణ్ పోలీస్ స్టేషన్ మహిళా పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు.**

**ఎల్బీనగర్, మార్చి 08 (భారత శక్తి):**

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మహిళా పోలీసులకు సన్మానం

ఎల్బీనగర్, మార్చి 08 (భారత శక్తి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్.హెచ్.ఓ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా అధికారులను, సిబ్బందిని సీఐ వినోద్ కుమార్ ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ, పోలీస్ వ్యవస్థలో మహిళా సిబ్బంది కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. వృత్తిపరమైన బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సమాజ రక్షణలో మహిళా పోలీసులు చూపుతున్న నిబద్ధత గర్వకారణమని ఆయన ప్రశంసించారు. మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.



# రాక్ టౌన్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

* మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డి

మన్సూరాబాద్రా, మార్చి 08 (భారత శక్తి): క్ టౌన్ కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. యోగా గురువు శ్రీ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాగే యోగా శిక్షణ బృందం, కాలనీ కమిటీ సభ్యులు కలిసి ఈ వేడుకలను నిర్వహించారు.

**ఆటపాటలతో సందడి**

ఈ సందర్భంగా కాలనీ మహిళలు యోగాసనాలతో పాటు వివిధ రకాల ఆటలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. ఒకరికొకరు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ వాతావరణాన్ని తలపించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**విశిష్ట అతిథుల సత్కారం**

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుగుణ రెడ్డి, ఎల్.బి. నగర్ ఎస్.ఐ. శృతిలను కాలనీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు సులోచన, శ్రీలేఖ, సరస్వతిలను శాలువాలతో సత్కరించి, అందరితో కలిసి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. "నేటి మహిళలు కుటుంబ బాధ్యతలే కాకుండా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. దేశ రక్షణలోనూ వారు కీలక పాత్ర పోషిస్తున్నారు."

**— ఎర్ర వినోద్ రెడ్డి, అధ్యక్షుడు, రాక్ టౌన్ అసోసియేషన్**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు యోగా గురువు మధుసూదన్ రెడ్డితో పాటు జైపాల్ రెడ్డి, సూర్యనారాయణ, రాంచంద్రా రెడ్డి, సంజీవ రెడ్డి, సంపత్ కుమార్, సుదర్శన్ చారి, శేఖర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి మరియు కాలనీ మహిళలు విశేషంగా పాల్గొన్నారు. కాలనీ మహిళలందరికీ అసోసియేషన్ తరపున అధ్యక్షుడు వినోద్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.





# ఆరోగ్యమిత్రలను ట్రస్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి

* క్యాడర్ స్ట్రెంత్ జీవో విడుదలపై హర్షం.. రాష్ట్రస్థాయి సమావేశంలో నేతల డిమాండ్

హైదరాబాద్ , మార్చి 08 (భారత శక్తి): రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలో గత 18 ఏళ్లుగా సేవలందిస్తున్న ఆరోగ్యమిత్రల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని పలువురు కార్మిక నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్రలకు క్యాడర్ స్ట్రెంత్ కల్పిస్తూ జీవో విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూనే, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.

**ప్రభుత్వ గుర్తింపు అవసరం: జాన్ వెస్లీ**

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆరోగ్యమిత్రల పాత్ర కీలకమన్నారు. దశాబ్ద కాలంగా పనిచేస్తున్న వీరిని ప్రభుత్వం తక్షణమే ట్రస్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ, ఆరోగ్యమిత్రలు సుదీర్ఘ కాలంగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వం ఇకనైనా ఆలస్యం చేయకుండా వారి సర్వీసును క్రమబద్ధీకరించాలన్నారు.

**మహిళా శక్తికి పిలుపు:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. జయలక్ష్మి మహిళా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ఎదురించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

**మంత్రికి కృతజ్ఞతలు:**

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య మాట్లాడుతూ.. ఆరోగ్యమిత్రల సుదీర్ఘ పోరాట ఫలితంగానే నేడు క్యాడర్ స్ట్రెంత్ జీవో సాధ్యమైందన్నారు. ఇందుకు చొరవ చూపిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ ఉదయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. కుమార్, ఉపాధ్యక్షులు సుమన్, రాష్ట్ర కమిటీ సభ్యులు కిషోర్, రవీందర్, వివిధ జిల్లాల అధ్యక్షులు రాజు (హైదరాబాద్), రత్నం (రంగారెడ్డి), నాగరాజు (నల్గొండ), యూసఫ్ (మేడ్చల్), బాలరాజ్ (వికారాబాద్)తో పాటు నగేష్, ఈశ్వరి బాయ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.







**హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శారదనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నందు నూతనంగా నిర్మించిన మహిళా భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తదుపరి ఇదే ఆవరణలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో పలువురు మహిళమణులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.**

**ఎల్బీనగర్, మార్చి 08 ( భారత శక్తి):**

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.